112

112

112 PNo 34
1944 Sl No 12

# అభ్యుదయ రచన

OFFICE OF THE REGISTRAR OF BOOKS
21 JAN 1944
MADRAS

రచయిత

సాహిత్య శిరోమణి

నాగభైరవ శివరామ కృష్ణయ్య

581
5433

కవితావనం

* బెజవాడ *

వలయువారు

కవితావనం

❖ బెజవాడ ❖

బెజవాడ : ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
అ. వెంకటరత్నం, M. Sc. గారిచే ముద్రింపఁబడియె. 1943.

# అభ్యుదయ రచన

OFFICE OF THE REGISTRAR OF BOOKS
21 JAN 1944
MADRAS

రచయిత:
నాగభైరవ శివరామకృష్ణయ్య

581/5433

సర్వస్వామ్యములు
గ్రంథకర్తవి

మూల్యం
అర్ధరూపాయి

## స్మృతి

సౌశీల్య సౌజన్యాది సద్గుణసంపత్తిచేతనూ, నిరాడంబర జీవితవిధానంచేతనూ, మాననీయులై త్యాగశీలమునందునూ, ఉదారచరితమునందునూ, విఖ్యాతి నంది నడివయస్సుననే కీర్తిశేషు లయిన శ్రీ అట్లూరి సుబ్బయ్యచౌదరిగారి స్మృతి చిహ్నముగా వారి సహధర్మచారిణి శ్రీమతి చంద్రిమ్మగారు ఈ గ్రంథ ముద్రణము నకు ధనసహాయ మొసంగుట, వారి పతిభక్తి పరాయణతనూ, త్యాగసంపత్తినీ, వెల్లడించుచున్నది. ఈ కావ్యరూపమున శ్రీ సుబ్బయ్యగారి నామము వాఙ్మయవీథులందు చిరస్థాయియై వారి పవిత్రాత్మకు శాంతి చేకూరు గాత!

రచయిత



శ్రీయుత అట్లూరి సుబ్బయ్య చౌదరిగారు.
వారి ధర్మపత్ని శ్రీమతి చంద్రమ్మ గారు. తెన్నేరు.

# నా మాట

అయ్యా! ఇది నా నాలుగో పుష్పం. లోగడ పూచిన మూడుపుష్పాలు ముఖ్యంగా కొందరి హృదయాలను మాత్రమే ఆకర్షించగల పరిమళాన్ని ఇవ్వగలిగాయి. అందువల్ల అందుబాటులో ఉన్నవారు, ఆనందించడం అతీతంగా ఉన్నవారు ఆగ్రహించడం జరిగింది. ఇది నిసర్గమని నిర్ణయించే పాత నీతి ఇదివరకు శాసనంగా ఉంది. కాని విశ్వమానవకళ్యాణం కోసం ఇప్పుడా శాసనోల్లంఘనం తప్పనిసరి. ఒక వర్గాన్ని బలపరిస్తే దాని క్రిందివర్గం పతితమౌతుంది. అన్నివర్గాలను బలపరచాలంటే కవి దృక్పథం విశాలంగా ఉండాలి. కాకపోవడం వల్లనే పై పుష్పాలు ప్రజాబాహుళ్యానికి సంపూర్ణమైన ఆనందాన్ని ఇవ్వలేక పోయినాయి. అందరికీ అందుబాటులో ఉండి ఆనందాన్ని కలిగించి ఆదరాన్ని సంపాదించుకోలేక పోవడం నా దేలోటు. ప్రస్తుత మాలోటును ఘాటుగా విమర్శించడమే అభ్యుదయం. ఈ లోటు నాకేగాదు, ఈ నాడు భారతకవితాలోకంలో నూటికి తొంభైతొమ్మిది మందికుంది. అందువలన ప్రత్యేకం కవితాలోకానికే నా రచననందజేస్తున్నాను. కవితాలోకం ద్వారా ప్రజలకు అభ్యుదయం కలగాలని నా ఆశయం. ఇందులో, భాష మాత్రం అనుకున్నంత అభ్యుదయంగా లేదు. దానికి కారణం కవితాలోకం ఈ భాషకు తీసిపోవని నమ్మిక. నిద్రాణమై యున్న భారత జాతిని వెన్నుచరిచి లేపి, ప్రబోధం చేయడానికి కవుల కలాలు ఎంత వాడిగా ఉండాలో తెలియజేయడమే నా విధి. ఆశయంలో తప్పంటే ఎటువంటితప్పో తెలియజేస్తారని నమ్ముతున్నాను. ఒప్పయితే ఆదరించి ఆచరిస్తారని నా ఆశ.

ఈ రచనకు నాకు సంపూర్ణసాహాయ్య మాచరించిన నా మిత్రులు బ్రిహ్మశ్రీ ఆకెళ్ల గోపాలకృష్ణశర్మగారికి హృదయపూర్వకమైన ధన్యవాదములు.

ఇట్లు,

శివరామకృష్ణయ్య.

## సూచన

ఇకనుంచి వెలువడు మా రచనలు తెనుగుకోట నుండి సంబంధము వదలుకొని "కవితావనం" నుండి ప్రచురింపబడతాయి. మూడేసి మాసాలకు ఒకరచన నందజేయాలని నా ఆశయం. కాని కాగితపు కరువురోజుల్లో గ్రంథం ముద్రింప బడాలంటే కష్టసాధ్యం. అయినా పాఠకలోకం, పోషకవర్గం చూపుతున్న ఆదరాభిమానాలు నాకు నూతనోత్సాహాన్ని ప్రసాదిస్తున్నాయి.

రాజకీయంగా, సాంఘికంగా, సారస్వతంగా అభ్యుదయ రచనలను కవితావనం నుండి ప్రకటించి ఆంధ్రదేశాని కందజేయడమే నా గ్రంథ మండలి కార్యక్రమము.

ఇతోధికమైన ఆదరాన్ని చూపి ప్రోత్సహించడం పాఠకలోకం కర్తవ్యము.

సెలవు.

కవితావనం, బెజవాడ. } సంపాదకుడు: నాగభైరవ శివరామకృష్ణయ్య.

21 JAN 1944 MADRAS

## అభ్యుదయ రచన

సామాన్యమానవుని భావదృష్టికిగాని బాహ్యదృష్టికిగాని గోచరింపని అపూర్వమనోహరత్వమూ విలక్షణ ప్రకృతి రామణీయకత, కళావిశిష్టత, భావసంపత్తీ, కళావేత్త అయి పరిణతప్రతిభగల కవిహృదయానికి గోచరిస్తాయి. ఈ ప్రత్యేకగుణంవల్లనే కవి తోడిమానవులకంటె భిన్నుడై వాఙ్మయస్థానంలో అజరామరమైన యశము నార్జిస్తూ కావ్యాకాశంలో ధ్రువతారయై అలరారుతున్నాడు.

ప్రతిభా, భావనాశక్తీ, కథాకల్పనా చమత్కృతీ, పాత్రోచిత భాషారచనా, కావ్యనిర్మాణానికి ముఖ్యపరికరాలు. కవి తన ఉత్కృష్టభావనాబలంచే ఇతివృత్తాన్ని భావించి, ప్రతిభచే పరికించి, కల్పనాచమత్కారముచే చిత్రించి, ఉచితభాషావిషయకంగా రచించి, ఉత్తమ కావ్యాన్ని లోకాని కందజేస్తాడు. అప్పుడు లోకం ఆ కావ్యంవల్ల ఆనందాన్నీ, ప్రయోజనాన్నీ, అనుభవించి, కవిని అనుసరిస్తుంది. తన్ను అనుసరిస్తున్న మానవసమాజాన్ని, సరియైన మార్గంలో ప్రవేశపెట్టి కర్తవ్య నిర్వహణ విషయంలో ధైర్యం కలదాన్నిగా తయారు చేస్తాడు కవి. కనక ప్రతిభ, భావనాశక్తి మొదలగు సాధనసంపత్తితో రచింపబడిన కావ్యము ఉత్కృష్టతరము, సహృదయసమ్మతము, సామాజికప్రయోజనకరము, కావడానికి, కించిత్తయినా సందేహంలేదు. అట్టి కావ్యప్రశస్తకు కైమోడ్పని పాఠకలోకంకూడా ఉండదు.

కావ్యం యశసేఽర్థకృతే
వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యః పరనిర్వృతయే కాంతా
సమ్మితతయోపదేశయుజే.

అని కావ్యానికి ఆలంకారికుల ప్రయోజన నిర్వచనము.

యశము, ధనసంపాదనము, వ్యవహారవివేచనము, ఆనందము, కాంతాసమ్మితముగా లోకోపదేశము — ఇవి కావ్యానికి ప్రయోజనాలు. వేదములు ప్రభుసమ్మితములు. ప్రభువు భృత్యుని శాసించురీతిగా వేదములు "సత్యంవద" "ధర్మంచర" మొదలగు విధివాక్యములచే శాసించును. పురాణములు సుహృత్సమ్మితములు. స్నేహితుఁడు హితాహితముల తెఱంగు తేటపరచురీతిగా, పురాణములు హితమార్గమును, అహితమార్గమునుకూడ మన చెంతనుంచును. కావ్యములు కాంతాసమ్మితములు. అనగా కాంత, విభ్రమ విలాసాల చేతను, కటాక్ష వ్యాపారముల చేతను, ప్రియుని తన కభిముఖముగా చేసికొని, అభీష్టప్రయోజనంలోకి ఏవిధంగా ప్రవేశపెడుతుందో, ఆవిధంగానే; ఉత్తమకావ్యం, ధ్వనిచేత పాఠకలోకాన్ని అవసరమైన రంగంలో ప్రవేశపెడుతుంది. అందుచేత కావ్యధోరణి సుకుమారంగాను, మనోహరంగాను ఉండి సహృదయునికి చక్కని మార్గాన్ని ప్రదర్శిస్తుం దన్నమాట. కాంతాసమ్మితమంటే; చిన్న ఉదాహరణ. సామాన్యంగా ఆంధ్రదేశంలో సాధారణకుటుంబాలలో ఉత్తమకాంత "ఏమండీ! చూశారా! వాళ్ళ సుబ్బమ్మ చంద్రహారాలు



చేయించుకొంది. ఎంతబాగున్నాయి అనుకున్నారు. అదృష్టవంతురాలు. ఒంటెడు నగలతో కలకలలాడుతోంది" అని భర్తతో పలుకుతుంది. అంటే తనకు కూడా చంద్రహారాలు కావాలని అభిలాష, ఆ వాక్యంలో ధ్వని. భర్తతో ఆవిషయం వాచ్యంగా చెప్పదు. భర్త సహృదయుఁడు కనక అయితే భార్యకోరికను మన్నించి మరునాటికి చంద్రహారాలు చేయిస్తాడు. అల్లాగే ఉత్తమకావ్యం; రాముడు పితృవాక్య పరిపాలకుఁడు. రావణుఁడు పరదారాసక్తుఁడు. రాముఁడు శత్రువులను జయించి పట్టాభిషిక్తుడయినాడు. రావణుఁడు పరకాంత నాశించి ధన మాన పుత్ర మిత్రాదులతో ప్రాణములను కోల్పోయినాడు, అని కావ్యకాంత చెపితే, రామునివలె సంచరింపవలయును, రావణునివలె సంచరింపకూడదు, రాముఁడనుసరించినమార్గము ఉత్తమము, అని సహృదయుఁడు గ్రహిస్తాడు. ఆ మార్గంలో ప్రవేశిస్తాడు. కనక ఉత్తమ రచన సమాజాన్ని సన్మార్గంలోనూ కర్తవ్యంలోనూ సంచరించడానికి ప్రేరేపిస్తుందని చెప్పడానికి మన కేవిధమయిన అభ్యంతరమూ లేదు.

"విశ్వశ్రేయః కావ్యం" అని వాగనుశాసనుడు. కావ్యానికి కేవలమూ పైన చెప్పబడినవి మాత్రమే ప్రయోజనాలు కావు. వీనికన్నిటికీ అతీతమయిన ప్రయోజనము విశ్వమానవ కళ్యాణము. "ఓ కవీ! నీవు కావ్యం వ్రాశావంటే ఆకావ్యం ప్రపంచమానవులకు కళ్యాణదాయకమై యుండాలి. స్వజాతి, స్వదేశము, స్వభాషాభిమానాలను విసర్జించి చైతన్యరహితమై

అధఃపతితమౌతున్న యీ జాతిని సముద్ధరించి, నిద్రాణమై, నీరసమై యున్న జాతీయతను రగుల్కొలిపి, దేశాన్ని ఆదర్శవంతంగా తయారు చేయడానికి కావ్యరచన సాగించు'' అని ఆదేశించాడు, ఆదికవి నన్నయభట్టారకుడు.

సమస్తమయిన మానవప్రపంచమూ కూడా ఒకే ఒక కుటుంబం. కవి కూడా ఈ కుటుంబంలోనే జన్మించాడు. చక్రనేమిక్రమంగా తిరుగుతున్న యీ సంసారపరంపరలో సంభవించే సుఖదుఃఖాలకు, కష్టనష్టాలకు, న్యాయాఽన్యాయాలకు ఇతరులవలెనే; అతడు కూడా భాగస్వామి. అందుచేత సమాజంలో ఏ ఒక్కనికి విచారం కలిగినా కవికి గూడా విచారం కలగాలి. ఏ ఒక్కడు ఆనందం అనుభవిస్తున్నా కవికూడా ఆనందం అనుభవించాలి. కాని సమాజంలో ఉండే శాఖోపశాఖలు, వర్గభేదాలు, జాతిద్వేషాలు, అతని దరిజేరడానికి వీలులేదు. అతని హృదయం నిరంతరం నిర్మలంగా వికాసంగా వినోదంగా ఆదర్శంలాగ వికసించాలి గాని మలినమయితే సామాన్యమానవత్వమే గోచరిస్తుంది. ప్రజాసముదాయానికి అతనిలో నుండే విశిష్టత వెల్లడి కావడానికి అవకాశాలుండవు.

నిజంగా ఆలోచిస్తే లోకంలో సహజంగా అందరూ కవులే. కాని వారిలో అణగియున్న కవిత్వం, ఉద్భూతం కావడానికి, కొన్ని బాహ్యకారణాలు కూడా అవసరం. సముద్రంలో బయలుదేరే తరంగమాలికలవలె కవి హృదయంలో బయలుదేరే భావనాపరంపరలు, బాహ్యకారణాలు, అనుకూలంగా



లేకపోతే వాటంతటవే సమసిపోతాయి. అనుకూలంగా ఉంటే గ్రంథరూపాన్ని తాలుస్తాయి.

సాంఘికపరిస్థితులు, రాజకీయవాతావరణము, మతస్థితి, మొదలయిన క్లిష్టసమస్యలు కవినికూడా యెదుర్కొని అతని భావనాశక్తికి బలాన్ని ఆపాదిస్తాయి. ఆ సమయంలో ఆతడు కలాన్ని చేత్తో పట్టుకొని తన్ను కలవరపెట్టే సమస్యల్ని గురించి వ్రాయడానికి ఉపక్రమిస్తాడు. అప్పుడే సమాజం కవికి సంపూర్ణమయిన ప్రోత్సాహాన్నీ, సహకారాన్నీ, సానుభూతినీ సంపాదించి యివ్వాలి. ఉత్తమరచన బయలుపడాలంటే, కవిలో నుండే సహజమయిన కవితాశక్తి విజృంభించాలంటే, సమాజం యొక్క సహకారాదరాలమీదనే ఆధారపడియుంది. సమాజం యొక్క స్థితిగతులకు సంబంధించని రచనలను సాగించిన రచయిత; తనంత తాను దెబ్బతింటాడు. కవియొక్క భావాన్నీ, శక్తినీ, అర్థంచేసికోలేని సమాజం, తనంత తాను నష్టపడుతుంది. కనక ఉభయుల సహకార ప్రోత్సాహాలవల్లనే ఉత్తమ రచన వాఙ్మయంలో ఉన్నతస్థానాన్ని అధిరోహిస్తుంది. అయితే కేవలము సమాజంయొక్క ఔన్నత్యంకొరకు వారి అభిరుచికి ఉచితమయిన రచననే కొనసాగిస్తే ఆ రచన తాత్కాలికంగా తన ధర్మాన్ని నిర్వహించుకొని తరువాత ప్రజాదరణ కోలుపోదా? అనే ప్రశ్న రావడానికి అవకాశముంది. నిజమే. నిర్జీవమై, నీరసమైన కవిత్వం విషయంలో యథార్థంగా అంతే జరుగుతుంది. కాని ప్రతిభా, కల్పనా చమత్కృతీ, వాస్తవికతా, కలిగిన కవిత్వం, తాత్కాలికంగా

ప్రయోజనాన్ని నిర్వహించుకొని, నిరంతరమూ, అభినవమై, ఆనందకరమై వాఙ్మయంలో చిరస్థాయి అవుతుందనడానికి సందేహంలేదు. యుద్ధరంగంలో దేశంకొరకు తమ సర్వస్వాన్ని త్యాగం చేయడానికి సంసిద్ధులయిన వీరుల నుద్దేశించి ప్రతిభతో వ్రాయబడి సజీవమయిన కవిత్వం తాత్కాలికంగా ఆ వీరుల రక్తాన్ని ఉడుకెత్తించి, దేశస్వాతంత్ర్యాన్ని, సంపాదించడమే గాకుండా, పది శతాబ్దాల తరువాత వచ్చిన యుద్ధమందైనా సరే! ఆ స్వాతంత్ర్యవాంఛనే, ఆ దీక్షాపరతంత్రతనే ప్రసాదిస్తుందిగాని దాని పూర్వపటిమ ఇసుమంతయినా మటుమాయమవడానికి సావకాశంలేదు. ఉదాహరణకు పల్నాటి వీర చరిత్ర చదవండి. నిరంతరమూ జీవకళలతోనే పూర్వకాలమందు రచింపబడినదయినా నేటికాలాన్నుద్దేశించి వ్రాయబడినదా? అనే సందేహాన్ని కలిగిస్తుంది. అదే ఉత్తమకవిత్వానికి లక్షణం. ఏనాడు చదివినా ఎప్పటికప్పుడు నూతనత్వం గోచరించే రచన, వాఙ్మయం ఉన్నంత కాలమూ అజరామరంగా నిలబడుతుంది.

దేశక్షేమంకొఱకు, విశ్వమానవకళ్యాణం కొరకు, ఉద్దేశింపబడిన రచనయే ఉత్తమ రచనగాని, తదితరంగా వ్రాయబడిన కవిత్వంగాని, కేవలం కళనే పరమార్థంగా ఎంచుకొని వ్రాయబడిన రచనగాని ఉత్తమం కాదంటారా? మీదృష్టిలో కళని ఖూనీచేసినా అంగీకరిస్తారా? అని మీ రడగవచ్చు. కళ కొరకు వ్రాయబడిన కవిత్వం, ఉత్తమ రచన కాదనను. దానిలో కవితాలక్షణాలన్నీ ఉండవచ్చు. సరసం కావచ్చు. దానివల్ల



ఆనందమే ప్రయోజనము కాని దేశానికిగాని సంఘానికిగాని సుతలామూ ప్రయోజనము లేదని సవినయంగా మనవి చేస్తున్నాను.

## అయితే ఏ రచన అవసరం?

దేశమంతా సుభిక్షంగా ఉండి, అన్నోదకాలకు కరవు లేక, రాజకీయరంగంలో విప్లవకల్లోలాలు లేక, ప్రజలలో పరస్పర విశ్వాసభావము, సోదరభావము, సహనము, కల రోజులలో, కవి తనకు అభిలషితమయిన విషయంలో కావ్యాన్ని నిర్మించవచ్చు. దానివల్ల సహృదయులు సంతోషించవచ్చు. శబ్దాలంకారాలు, అర్థాలంకారాలు, రీతులు, వృత్తులు మొదలయిన విశేషాలతో కవి తన పాండిత్యాన్ని ప్రదర్శించడానికి అనువయిన రోజులవి. గురువుగారి గృహము పరశురామప్రీతి అవుతున్న సందర్భంలో సాధనకొరకు సంగీతంతో విషయాన్ని మనవి చేసికొనే శిష్యచూడామణుల వంటివారు కాదు గదా కవికుమారులు!

నేడు భారతదేశంలో సర్వత్రా దుర్భిక్షపిశాచం ఆయసకింకిణీధ్వనులతో తాండవమాడుతోంది. ఆకలి దయ్యం, ఆపాదమస్తకమూ ప్రతినరాన్నీ పీలుస్తూ దైన్య కంకాళాలపై విరుచుకుపడి, వికటాట్టహాసం సల్పుతోంది. రాజకీయరంగంలో క్షణక్షణమూ ప్రతిస్తంభన సహస్రములే ప్రదర్శింపబడుతున్నాయి. జాతిభేదాలు, కుల కక్షలు, వర్గ పోరాటాలు, అసహనం, అన్యాయం, మోసగింపులు, చెలరేగి ప్రజానీకానికి దుర్భరభారాన్ని తెస్తూ, శాంతిభద్రతలకు,

అపాయాన్ని ఆపాదిస్తున్నాయి. యుద్ధాగ్ని, దేశం నలుమూలలా కార్చిచ్చులాగ వ్యాపించి సర్వమారణమూ, సమకూర్చడానికి సన్నద్ధమవుతోంది.

ఇల్లాంటి సమయాల్లో కవికుమారుల కలాలు, ఆనందించే కోకిలాలాపముల మీదనా? లేక, ఆకలిమంటలచే అలమటిస్తూన్న అసంఖ్యాక క్షామపీడితుల అనునయాలాపముల మీదనా? కొండచరియలలో జలజలా ప్రవహించే సెలయేటి ప్రవాహములమీదనా? లేక యుద్ధరంగంలో దేశస్వాతంత్ర్యము కొఱకు, అసువుల నర్పించే, వీరవరుల రుధిరప్రవాహముల మీదనా ? విరహవేదనతో విసిగి వేసారి; దేవతామూర్తియైన ప్రేయసి నుపాసించుటకు ప్రేమగీతికలయందా ? లేక సమాజం యొక్క ఇనపనాళాల జోళ్ళతో త్రొక్కబడి, దిక్కూ మొక్కూ లేక అనాథలై విలపిస్తున్న భారతీయ సోదరీ సహస్ర కష్టపరంపరాగీతికలయందా ? ప్రసరించుట. ఏది ఉచితమో, అవసరమో, గమనించండి.

కనుకనే దేశకాలపరిస్థితుల ననుసరించి కవిత్వం వ్రాయాలని పెద్దలన్నారు. లేకపోతే, దేశంలో ఆ కవిత్వానికిగాని, కవికిగాని, చలామణీ నహీ. ప్రబంధయుగంలో వేనకువేలు శృంగారకావ్యాలు ఆంధ్రభాషలో వ్రాయబడ్డాయంటే ఆ కాలం వేఱు. నాటిపరిస్థితుల ననుసరించి ప్రజ లాకావ్యాలను ఆదరించారు. కవులు రచించారు. ప్రజానీకానికి రుచించాయి. నేటికాలాని కవి రుచింపకపోవచ్చు. కాని ఆ కావ్యాల్లోఉండే విశిష్టసౌందర్యమువల్లనే యీనాటికీ కొన్నికావ్యాలు ఆరాధింప



బడుతున్నాయి. ప్రతిభా, భావనాశక్తీ, లేని ఆనాటి కావ్యాలు కొన్ని యీనాడు రూపుమాసాయి. కారణం కాలానికి అవసరం లేకపోవడమని వ్రాయ నవసరములేదు.

“ఎవ్వరేమనుకొన్న నాకేమి కొదువ” అని యీనాడు కూడా కొన్ని కావ్యాలు వ్రాయబడుతున్నాయి. విరహవేదన, ప్రథమవీక్షణము, స్వప్నసందర్శనము, కోకిలాలాపములు, ప్రేయసీ ప్రేమగీతికలు, తుమ్మెదల ఝుంకారాలు, సెలయేళ్ల జలజలలు, ఆరాధనము, మొదలయిన విషయాలు, ఆ కావ్యాలలోని కథావస్తువులు. ఈ కావ్యాలు సామాన్య జనులకు మాత్రము అర్థంకావు. కొన్ని పద్యాలకు కవిగారే వచ్చి స్వయంగా వ్యాఖ్యానంచేస్తూ భావాన్ని చెపితేనేగాని బుఱ్ఱకెక్కదు. పద్యం చేత్తోపట్టుకొని రైలుఖర్చులు తీసికొని కవిగారివద్దకు ప్రయాణమవుదామా ? కవిత్వాన్ని దూరంగా వదులుదామా ? ఏది ప్రస్తుతం అవసరం ? కాని ఆ కావ్యాలలోని ధ్వనీ, భావమూ, భాషాసంపత్తీ, మొదలయిన వానికి నా ధన్యవాదాలు. ఆ విషయాలను నిందించడానికి కూడా నాకిష్టంలేదు. వానిని చదివి ఆనందించే పాఠకులలో నేను కూడా ఒక్కడనే. కాని, ఆ కావ్యాలవల్ల సార్వజనిక ప్రయోజనము శూన్యమని వ్రాయడానికి సాహసిస్తున్నాను. “ఇతరుల ఆనందంతోగాని, ప్రయోజనంతోగాని, నాకు నిమిత్తంలేదు. నే నితరులకొఱకు వ్రాయనే లేదు. నా ఆశయంకోసం, నా ఆనందంకోసం, వ్రాసుకొన్నాను. ఇష్టంలేకపోతే మీరు చద

వడం మానుకోండి'' అని అంటారేమో ? అయితే జోహారు. కాని ఒక్క మనవి.

మన దేశంలో చదువుకొన్న వారిసంఖ్య చాలా తక్కువ. బానిస భావాలు మనశిరస్సుమీద తాండవమాడుతున్నాయి. వాఙ్మయంమీదా, కవిత్వంమీదా, కళలమీదా, అభిమానమున్న సహృదయులు ఇంకా స్వల్పము. కవిత్వాన్నీ, కళలనీ, పోషించే మహానుభావులు వేళ్ళమీద లెక్క పెట్టదగిన వారున్నారు. ఇల్లాంటి దేశంలో కవి ఒక పుస్తకం వ్రాశాడంటే; చదివి ఆనందించేవారు ఎందరుంటారో ? గమనించండి. కావ్యానికి ఆత్మానందం మాట వేరుగా ఉంచి, సార్వజనిక ప్రయోజనము అవసరమంటారా? కాదంటారా? అవసరమయితే అల్లాంటి రచనల నెందుకు వ్రాయకూడదు? ఆత్మానందమే ప్రయోజనమయితే తోడి సోదరమానవులు కష్టపరంపరలో తగుల్కొని బానిసత్వంలో మునిగి అల్లాడుతూ ఉన్న యీ రోజులలో మీరొక్కరే ఆనందిస్తామంటే; అది సహృదయలక్షణము కాదు. అంత స్వార్థపరత్వముకూడా న్యాయమూకాదు. అల్లాంటి కవికుమారులు మానవ సమాజాన్ని విసర్జించి, లోకంతో సంబంధ బాంధవ్యాలు తెగ తెంపు చేసికొని, మునివేషంతో ఏ కొండచరియల దరినో, ఏ సెలయేరుల ప్రాంతనో ముక్కుమూసికొని తపస్సు చేసికొంటూ, పద్యాలు వ్రాసికొంటూ, అవ్యక్తానందాన్ని అనుభవిస్తూ కాలం గడపటం ఉచితమని నా సలహా. సమాజానికి ప్రయోజన మియ్యక సమాజంవల్ల తాము ప్రయోజనాన్ని అనుభ



వించక వ్యర్థంగా ఉండే పూజ్యపాదులు ఎక్కడవుంటే వారి కేమి కొదువ? ఎవ్వ రేమనుకొంటే వారి కేమి నష్టం?

కవిత్వమంటే జోడుగుఱ్ఱాలమీద ధౌతమేఘాలలోకి దౌడుకొట్టడం కాదని యీమధ్య ఒకరు వ్రాశారు. వాస్తవంగా అంతే. ఎవ్వరికీ అందకుండా స్వతంత్రించి తానొక్కడే విహాయసవీధుల్లోకి విహారం చేయడం గాదు కవిత్వం. కవి ఆసాయమూ ప్రజలలో మసలుతున్నాడు. ప్రజల చిత్తవృత్తుల్ని పరికిస్తున్నాడు. ప్రజల కష్టనష్టాలలో తానొక భాగస్వామియై పాల్గొంటున్నాడు. ప్రజాసముదాయంయొక్క దైనందిన జీవితసమస్యల్లో తానొక బాధ్యత కల మనిషి. అల్లాంటి కవి తనవల్ల ఇతరులకు ప్రయోజనం కలగకుండా ఎక్కడకో భావనాస్వర్గంలోకి పారిపోతాననడం, సముచితమయిన పంథా గాదు. కనుక ప్రజల అభిరుచికి ప్రజోద్యమాలకి, దోహదమిచ్చే ఉత్తమరచనలను రచించి, మత్తుతో, మైకంగా, మందంగా, కర్తవ్యజ్ఞానం లేక తెలిసికో లేక, మూలమూలల పల్లెటూళ్ళల్లోనూ, పట్నవాసాల్లోనూ, నిద్రపోతూన్న అశేషప్రజానీకాన్ని మేలుకొలిపి కర్తవ్యజ్ఞానాన్ని పురిగొల్పడమే కవియొక్క ప్రధానకర్తవ్యము. అతని భావనాశక్తి, ఆవేదనా, ప్రేమా, ప్రతిభా, సర్వతోముఖంగా ప్రజానీకంపై ప్రసరింపజేసి కలం చేత్తో పట్టుకొని కావ్యాన్ని సృష్టిస్తే, జీవకళ తాండవిస్తుంది. ప్రజానీకమంతా ప్రణామ పురస్సరంగా బ్రహ్మరథం పడుతుంది. నిజంగా కవి కుమారుడే కలం చేత్తో పట్టుకొని కావ్యరంగంలో కదనం ప్రారం

భించాడంటే యీ చిరంతనదాస్యశృంఖలాలు భిన్నాభిన్నమై శిథిలమై పోతాయి. భారతదేశాన్ని అంటిపెట్టుకొని, చిరకాలంనుండీ కాపురం చేస్తూఉన్న యీ దరిద్రపిశాచం రూపుమాసి నశించిపోతుంది. సాంఘికభేదాలు సక్రమంగా వాటంతట అవే చల్లారి సమసిపోతాయి. సామాన్య ప్రజలపై రాజ్యం చేస్తూఉన్న నిరక్షరాస్యత కూకటివేళ్ళతో సమూలించుకుపోతుంది. కనక పాతసాంప్రదాయాలతో గతానుగతికంగా నన్నయనాటినుండీ వస్తూన్న కావ్యరచనాధోరణీ ప్రస్తుతం పనిచెయ్యదు, అధునాతనంగా ఆంగ్లానుకరణంగా అనుసరింపబడుతూ ఉన్న కవిత్వధోరణి కూడా బానిసభారతదేశాన్ని బాగుచెయ్యదు. ప్రస్తుతకాలంలో సమాజానికీ జాతికీ, చైతన్యం కలగజేసి ప్రజలను కర్తవ్యోన్ముఖులనుగా తయారు చెయ్యాలంటే కవిత్వంలో అభ్యుదయపంథాను అనుసరించాలి. అంటే కవి అభ్యుదయరచనలను రచించి తోడిసోదరలోకానికి మార్గదర్శకుడై నాయకుడై ప్రజాహృదయాన్ని చూరగొనాలి. ప్రజల్ని ఎదుర్కొంటున్న విషమసమస్యల్ని రూపుమాపడానికి తన సర్వశక్తులనూ వినియోగించి పాటుబడాలి. ప్రజాహృదయంలో తాను కవితారూపంగా ఆవేశించి దేశం కోసం ఆవేశపూరితులను చెయ్యాలి. కర్తవ్యాన్ని సులభంగా బోధించాలి. "ఈ దేశం నాది; నా దేశం కోసం నా సర్వస్వమూ త్యాగం చెయ్యడానికిగాని, నా రక్తంతో దేశమాత నభిషేకం చేయడానికిగాని వెనుకంజ వేయడానికి వీలులేదు" అనే కరడుగట్టిన జాతీయభావాన్ని దేశంలో



ఎల్లెడలా వ్యాపింపజేయాలి. అందుకనే కవిత్వం విషయంలో కవి సోదరులు అభ్యుదయపంథాల ననుసరించాలని విన్నవిస్తున్నాను.

## ఏది అభ్యుదయ కవిత్వం?

"అభ్యుదయ కవిత్వం" అనే పేరుతో భాషా విషయకంగా విప్లవాన్ని లేవగొట్టి భాషామతల్లికి అపచారం చేయబోతున్నానని నామీద కోపగించకండి. అభ్యుదయమంటే అభివృద్ధి. దానితో కూడిన కవిత్వము అభ్యుదయ కవిత్వము. దానికే అభ్యుదయ రచన అని నామాంతరం. అనగా సమాజానికి అభివృద్ధిదాయకమైన రచన అని అర్థము. అంతేగాని పద్యలక్షణాన్నిగాని, కావ్యలక్షణాన్నిగాని, రసపుష్టినిగాని, విసర్జించి యథేచ్ఛగా కావ్యరచన కొనసాగించమని నా ఆశయం కాదు. లక్షణాలూ, నియమాలూ పూర్వకాలాన్నుంచీ మన దేశంలోవున్నవే, కాని, భాషలోనూ, భావాల్లోనూ, రచనాపద్ధతిలోనూ, మాత్రమే నూతనపంథా- అభ్యుదయపంథాను అనుసరించమని నా విన్నపము.

ఏది అభ్యుదయరచన? భాషాభ్యుదయమా? భావాభ్యుదయమా? లేక రెంటిని జోడీకరించి తీసుకురావడమా; అసలు వీటన్నిటినీ తప్పించుకొని మరొక నూతన రచనాప్రపంచంలోకి ప్రయాణం సాగించడమా? అనే సమస్యల్ని పరిష్కరించుకొంటేనేగాని, అభ్యుదయపంథాలోకి అడుగుపెట్టలేము. ఎందువల్లనంటే, వాఙ్మయ పటుత్వాన్ని చూపెట్టే ఆ ప్రాచీన కవితాచమత్కృతీ, భౌతిక జీవిత సాధనాన్ని మన

పించే ఆ ఆధ్యాత్మిక భావనాసంపదా మన సనాతనపీఠాధిపతుల హృదయాల్లో యిదివరకే కరడుగట్టి నిలవున్నాయి. భావాన్ని దిగమ్రింగి కేవలం భాషాసామ్రాజ్య సింహాసనానికి పట్టభద్రులయిన కుండలపండితులూ లేకపోలేదు. కేవలం భాషకు దాసులుగాక భావనాకాశంలో స్వర్గసౌధాలు నిర్మించే భావకవులూ లేకపోలేదు. అయితే ఆ రెండు విధాలయిన కవిత్వాలూకూడా నేటి సమాజంయొక్క ఔన్నత్యానికి దారి చూపడానికి సమర్థమయినవి కానేరవు.

ప్రస్తుతం మన దేశమాత అన్నివిధాలా రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా, నైతికంగా, బహుశోచనీయావస్థను అనుభవిస్తోంది. భారతదేశం మాట దూరంగా వుంచండి. ప్రపంచమే మారణయంత్రాల మధ్య, అగ్నిగోళాల క్రింద, తహతహలాడుతోంది. ఇల్లాంటి సమయాల్లో సామాన్య ప్రజల ధైర్యం సన్నగిల్లి కర్తవ్యజ్ఞానం శూన్యమవడానికి సందేహం లేదు. ప్రజలలో ధైర్యాన్నీ, విజ్ఞానాన్నీ, వికాసాన్నీ, పురిగొల్పాలంటే; వారికి విషయాన్ని కరతలామలకంగా తెలియజేయాలి. నిరక్షరాస్యు లయిన సామాన్యప్రజలకి కూడా సాకల్యంగా తెలియజేయాలంటే సంస్కృత భూయిష్ఠమయిన కవిత్వం; సమాసాలూ మొదలయిన పాండిత్య ప్రకర్షను వ్యక్తపరచే విధానం పనికిరాదు. సులభంగా పామరజనులకు సహితమూ అర్థమయ్యే భాషలో వ్రాయబడి వుండాలి.

రాజకీయంగా అభ్యుదయ రచయితల ఆవశ్యకత చాలా అధికము. భారతదేశ సమీపంలో ఫాసిస్టు దురాక్రమణదారు



లయిన జపానుదుండగీండ్రు దేశాన్ని కబళించడానికి పొంచియున్నారు. ఈ సమయంలో దేశరక్షణభారము సర్వస్వమూ యువ కవికుమారుల కలంమీద ఆధారపడివుంది. ఖడ్గపాణియై కదనరంగంలో శత్రుహృదయాన్ని చీల్చే యోధవరుని ఆవశ్యకత యెంతో, కవివరుని ఆవశ్యకత కూడా అంతే వుంది. కవులు గూడా వైజ్ఞానికదృష్ట్యా రక్షకు లన్నమాట. సైనికుడు తన భుజబలంతో యుద్ధంచేసి, దేశాన్ని రక్షించుకొంటాడు. కవి ఉద్వేగపూరితమైన తన పునీతకవితాస్రవంతితో సమాజాన్ని శుద్ధిచేసి జాతీయైక్యమును స్థాపించగలడు. ఆవిధంగా సుస్థిరమయిన జాతీయైక్యము దేశంలో పాతుకొని పోయిననాడు అది దేశానికి పెట్టనికోట. దేశరక్షణకు బలవత్తరమయిన ఆయుధం. లక్షలమంది సైనికులు భుజబలంతోనూ ఫిరంగిగుండ్లతోనూ, మారణయంత్రాలతోనూ, రాక్షసకృత్యాలతోనూ, సంఘటితపరచలేని రక్షణావిధానాన్ని, కవి, తన మానసికశక్తితో, సంఘటితపరచి దుర్భేద్యమైన కోటను దేశానికి నిర్మించగలడు. ఇది విజ్ఞానంతో కూడుకొన్న నైతికరక్షణ. అది శారీరకబలంతో కూడుకొన్న దౌర్జన్యరక్షణ. కవి, లోకంలో కిరీటం లేని రాజు. రాజు దేశంలో దౌర్జన్యం, విప్లవం, చెలరేగకుండా వుండడానికి శాసనాలను అమలుపరుస్తాడు. సత్కవి దేశంలో మానవజాతికి ఉత్తమవిజ్ఞానసంపదను పెంపొందించడానికి నీతివంతమయిన శాసనాలను శాసిస్తాడు. సమాజంయొక్క అభ్యుదయానికి అనుకూలంగా వుండి మానసికశక్తిద్వారా యేర్పరిచే నీతిశాసనం నిలచినన్ని రోజులు, సమాజంయొక్క

కష్టసుఖాలకు, యోగ్యతాయోగ్యతలకు, సంబంధం లేకుండా తన నిరంకుశరాజ్యానికి అనుకూలంగావుండే దౌర్జన్యమే ప్రధానాయుధంగా వుపయోగించిన రాజశాసనం నిలవడం కష్టనువుతుంది. అందువల్ల సమాజం యొక్క మేలు కోరే అభ్యుదయరచయితయే దేశాన్ని ముందుకు తీసుకు రావడంలో సుఖమూ, తేలిక, శాంతీ వుంది. ఇప్పటి సమాజం అభ్యుదయానికీ, సుఖానికీ, శాంతికీ, కొన్ని వేల మైళ్ల దూరంలో వుంది.

కనుక అభ్యుదయ కవి,తన రచనల మూలంగా మాతృదేశ రక్షణ కొరకు, ప్రతిభారతీయపౌరునీ తయారు చేయాలంటే, ఉద్రేకం, దేశభక్తీ, దురాక్రమణదారులవల్ల రాబోవు ఆపత్పరంపరా, ప్రతిబింబించేటట్టు ప్రతిపల్లెలోనూ ప్రచారమున కనువగు గేయాలు, ఏకాంక నాటికలు, పదాలూ, బుఱ్ఱకథలూ, వ్రాయాలి. ఉపన్యాసాలవల్ల, ప్రబోధాలవల్ల, కల్పింపలేని విజ్ఞానాన్ని నాటికల మూలంగానూ బుఱ్ఱకథల మూలంగానూ వెదచల్లవచ్చు. నేడు చైనాలోని అభ్యుదయ రచయితలందరూ తమ దేశరక్షణకొరకు చేయుచున్న సాధనాలీ రూపంగానే వున్నాయి. అచ్చటి కవులందరూ దేశరక్షణ కొరకు తమ కవితాశక్తినీ,కళావైదగ్ధ్యాన్నీ వెచ్చించి,ప్రతిపౌరునీ దేశంకొరకు కత్తిపట్టుకొనే వీరునిగా తయారుచేస్తున్నారు. చైనాలో అభ్యుదయరచయితలు కావిస్తున్న దేశసేవ అపారము. యుద్ధాగ్నుల మధ్య మండుతూ, అశాంతి సముద్రంలో మునుగుతూ, అల్లాడుతూ వున్న చైనాకు పట్టిన



దౌర్భాగ్యమే భారతదేశానికి కూడా అనతికాలంలో రావడానికి సిద్ధంగా ఉంది. ఇల్లాంటి సమయంలో కూడా కవులు మడిగట్టుకొని మా ఆనందంలోనే తన్మయం అవుతాము, మాకు దేశంతో నిమిత్తం లేదంటారా? దేశీయ ప్రజలతో కలసి మెలసి వారి చిత్తప్రవృత్తికి, అభివృద్ధిదాయకమూ, ఆహ్లాదకరమూ, అవసరమూ, అయిన విధానంగా రచనావిధానాన్ని సాగిస్తారా? గుండెపై నిబ్బరంగా చేయివేసికొని నిష్పక్షపాతంగా ఆలోచించండి.

శ్రవ్యకావ్యాల కంటే దృశ్యకావ్యాలు సర్వజనుల హృదయాలనీ సులువుగా ఆకర్షించడమే గాకుండా కర్తవ్యాన్ని తేలికగా బోధిస్తాయి. నాటకాలవల్ల ప్రజలకు కర్తవ్య జ్ఞానం కరతలామలక మవుతుంది. ఎంత నిరక్షరాస్యు డయినా నాటకాన్ని వీక్షించి కర్తవ్యోన్ముఖుడు కాకమానడు. ఆ కథా విధానంలోనూ, బోధనాపద్ధతిలోనూ గల మార్దవాన్ని మనస్సు కెక్కించుకొని యితరులతో నిమిత్తం లేకుండా తనంత తాను కార్యరంగంలో ప్రవేశించడానికి అవకాశముంది నాటక ద్రష్టకు. సంస్కృతవృత్తాలయిన మత్తేభ శార్దూలాదులలో ప్రబోధం చేయడం కంటే గేయాలతోనూ, పాటలతోనూ, ప్రజాహృదయాన్ని చూరగొనడానికి ఎక్కువ అవకాశముంది. ప్రస్తుతం దేశసంక్షోభాన్ని, రాజకీయ ప్రతిష్టంభనాన్ని, తొలగించాలన్నా, ఆహారసమస్యను పరిష్కరించి ఆకలి మంటలను చల్లార్చాలన్నా, దేశంలో కళ్యాణ చిహ్నాలను పాదుగొల్పాలన్నా, జాతీయప్రభుత్వం ముఖ్యావసర మన్న విషయం

నిర్వివాదం. జాతీయ ప్రభుత్వాన్ని దేశంలో స్థాపించాలంటే దానికి జాతీయైక్యత ముఖ్యసోపానము. ఆ జాతీయైక్యతకు హిందూ మహమ్మదీయ సఖ్యత పునాది. నేను జాతీయైక్యత కొరకు, హిందూ మహమ్మదీయ సఖ్యతకొరకు, పాటుపడవలసిన వాడు కవి కుమారుడు. ఆ బాధ్యతను గురించి కవికుమారులంతా రాజకీయరంగములో నూతనచైతన్యాన్ని ఉత్తమప్రబోధాన్ని ప్రసాదించే సరిక్రొత్త రచనలను ప్రజా సముదాయానికి అందజేసి, తాను కవితాస్రవంతితో ప్రజానీకానికి మార్గదర్శకుడై దేశస్వాతంత్ర్యాన్ని ఉద్ధరించడానికి నడుం కట్టుకోవాలి.

మనం ఆంధ్రులం, ప్రత్యేకఆంధ్రరాష్ట్రం కావాలని చిరకాలం నుండీ ఆందోళన సాగిస్తున్నాము. విద్యాధికులయిన యే కొద్దిమందికో తప్ప మిగిలినవారి కీ రాష్ట్రావశ్యకతయే, తెలియదు. ఆంధ్రరాష్ట్రసంపాదనవిషయంలో రాయలసీమవాసుల దృష్టి వేరు విధంగా ఉంది. సర్కారాంధ్రులకు, రాయలసీమవాసులకు సామరస్యం కుదరడం లేదు. రాష్ట్రనిర్మాణవిషయంలో తమిళులు ప్రతికూలంగా ఉన్నారు. ఈ సమయంలో యావదాంధ్రజాతినీ సమ్మేళనపరచడానికీ, సత్వర విశాలాంధ్రరాష్ట్రనిర్మాణానికీ కవియొక్క కలమే ముఖ్యావసరం. ప్రథమంగా ప్రత్యేకరాష్ట్రం లేకపోవడం వల్ల ఆంధ్రు లనుభవిస్తున్న అగచాట్లు, ఆవేదనా, అవమానం, అందరి హృదయాలలోనూ, హత్తుకొనేటట్లు చిత్రించాలి. పిమ్మట రాష్ట్రనిర్మాణం కొరకు అవసరమయిన ఐకమత్యాన్ని



కలగజేయడానికి, ప్రజాసముదాయాన్ని ఏకముఖంగా సంఘటితపరచాలి. సంఘటితప్రజానీకాన్ని సత్వరాంధ్రరాష్ట్ర నిర్మాణానికి అవసరమయిన కార్యకలాపాల్ని వ్యవహరించడానికి కర్తవ్యాన్ని బోధిస్తూ సందేశాన్ని తానే యివ్వాలి. అప్పుడు కవితోపాటు లోకం వెన్నాడుతుంది. అతని నాయకత్వం అంగీకరిస్తుంది. అతని కనుసన్నలలో విశాలవిశ్వమంతా వర్తిస్తుంది. ఈ కవియొక్కా, ప్రజలయొక్కా, సామరస్యం వల్ల నిద్రాణమై, నిర్జీవమై యున్న విశాలాంధ్రజాతి జాగరితమై సత్వరవిశాలాంధ్రరాష్ట్రనిర్మాణానికి దారి తీస్తుంది.

వర్తమాన కాలంలో కవిత్వంలో సిద్ధహస్తు లయిన విఖ్యాతకవు లెవ్వరూ రాజకీయరంగంలో పనిచెయ్యక పోవడం, దేశానికి దురదృష్టమే గాకుండా ఆంధ్రజాతి భవిష్యదభివృద్ధికి ఆతంకదాయకము. నిజంగా తమ పునీతకవితాస్రవంతిలో పాఠకుల్ని తలమునకలు వేయించే ఆ మహానుభావులు పూనుకొన్నట్లయితే, ప్రజల్ని ఆవరించి మత్తుకలిగించుచున్న యీ నిస్పృహ, నిరాదరణ, స్వార్థపరత్వమూ, నశించిపోయి, జాతికి చైతన్యం కలగడంలో ఏమాత్రమూ సందేహంలేదు. చైతన్యంద్వారా కార్యరంగంలో ప్రవేశించడానికి ప్రజ సన్నద్ధమవుతుందని వ్రాయడం చర్వితచర్వణం. శ్రీ విశ్వనాథ, రాయప్రోలు కవుల ఆంధ్రప్రశస్తి, ఆంధ్రోన్నత్యాలు వాస్తవంగా శిథిలమైపోయిన ఆంధ్రుల పూర్వౌన్నత్యాన్ని సర్వతోముఖంగా చాటాయి. ప్రస్తుత దైన్యస్థితిని సూచించాయి. గడచి, నిరాదరణచే విస్మరింపబడి, కాలగర్భంలో

లీనమైయున్న పూర్వాంధ్రప్రశస్తిని స్మరించి, ఒడలు జలద
రింప, పరవశంపొంది, ఆనందాన్ని అనుభవిస్తామా? వర్తమాన
నీచనీరస బానిసస్థితిని అనుభవిస్తూ, అసహాయతనూ, అస్వ
తంత్రతనూ సూచిస్తూ అశ్రుబిందువులను రాలుస్తామా?
పూర్వౌన్నత్యాన్ని పొందడానికి మార్గం ఏది? దాని నేవిధంగా
అనుసరించాలి? అన్న ప్రశ్నలువేస్తే ఆ గ్రంథాలవల్ల
సమాధానాన్ని పొందలేము. కావలసిన విషయం గగనకుసుమ
ప్రాయమయింది. పైగా వారి పుస్తకాలను విజ్ఞానమున్న
యే కొద్దిమంది మాత్రమే చదువుతూ ఉంటారు. గాని
సామాన్య జనులకు పూర్వాంధ్రప్రాభవమయినా గోచ
రింపదు. ఆ కవిశేఖరులంతా వర్తమానయుగంలో అభివృద్ధి
దాయకమైన విధానంలో, సార్వజనికప్రయోజనం కలిగే
ఉద్దేశంలో, రాజకీయ రంగంలో సర్వజనులకూ ప్రవేశం కలిగే
పద్ధతిలో రచనలను సాగిస్తే యావదాంధ్రవాఙ్మయచరిత్ర
లోనూ, నూతనశకం ప్రారంభ మవుతుందని చెప్పడం అతిశ
యోక్తి కాదు. దేశం తరిస్తుంది. ప్రజలందరూ సుఖిస్తారు.
సర్వవిధాలా ప్రాచీనౌన్నత్యం అనుభవించి ఆంధ్ర అక్క
చెల్లెండ్రలో అసమాన విఖ్యాతితో మకుటంగల మహారాణియై
అలరారుతుంది. అసంభవం అనడానికి అవకాశములేదు.

ఆర్థికంగా ఆంధ్రదేశ మనుభవిస్తూఉన్న యాతనా
పరంపర వర్ణనాతీతము. యుద్ధం ప్రళయకాలదావాగ్నివలె
నలుమూలలా వ్యాపించి యుండడంచేత ఆహారసమస్య ప్రతీ
వానికీ విషమంగా పరిణమించింది. అన్ని రాజకీయపక్షాలూ



ఆహారసమస్యవిషయంలో ఏకాభిప్రాయంతో పనిచేస్తు
న్నాయి. సామాన్యప్రజల "అన్నమో రామచంద్రా" అను
ఆర్తనాదం భూనభోంతరాళాలు వ్యాపిస్తోంది. దేశంలో క్షామ
దేవత స్థిరనివాసం ఏర్పరచుకొంది. తిండిలేక ప్రజలు మల
మలమాడి చివరకి అసువుల్ని గోల్పోతున్నారు. కడుపుమంట
చల్లార్చుకోడానికి దోపిళ్ళు బందిపోట్లు వ్యాపించి ప్రజల శాంతి
భద్రతలకు అపాయాన్ని ఆపాదిస్తున్నాయి. వీథులలో పార
వేసిన పులివిస్తరాకులకొరకై కుక్కలతో పోట్లాడి పొట్టలను
నింపుకొంటున్నారు పట్నాలలో కొందరు. ఆహారపదార్థం
దొరకకపోవడంవల్ల క్షుత్తును తగ్గించుకోడానికి, ఆకులను,
కాయలను తింటే కలరా మొదలయిన వ్యాధులు సంక్రమించి
బలిగొంటున్నాయి ప్రజానీకాన్ని. బక్క చిక్కి శల్యావ
శిష్టులై, కొనయూపిరితోనున్న ప్రజలను మలేరియా మొదల
యిన విషవ్యాధులు కబళిస్తున్నాయి. ఏ ప్రాంతాన పరికించినా
ఆకలిమంట. ఏ ప్రదేశం చూచినా ఆర్తనాదాలు. ఎక్కడ
చూచినా అన్నాతురుల హాహాకారాలు. దీనికి తోడు నదుల
వరదలు. పంటల నష్టము. అతివృష్టి, అనావృష్టులవలన దేశా
నికి ఉపద్రవము.

దేశం యావత్తూ ఈ విధంగా బీభత్సంగా ఆకలిమంట
లతో అల్లాడుతూఉంటే, దేశంలోని వివిధ రాజకీయపక్షాలూ
భిన్నమార్గాలను, ఆశ్రయించి అభిప్రాయభేదాన్ని సూచిస్తూ
ఉంటే పంచమాంగదళం, జపాను ఏజంట్లు దుష్ప్రచారాన్ని
కొనసాగిస్తూ, దేశమాతను దుర్భరదాస్యకర్దమంలో దింపడానికి

ప్రయత్నిస్తూ ఉంటే, జాతీయవాదులయిన కాంగ్రెసు నాయకులు కారాగారాల్లో కడగండ్లు పాలవుతూ ఉంటే, ప్రజా సముదాయంయొక్క చిత్తవృత్తీ, వారి భావాలూ, ఏవిధంగా ఉంటాయో వూహించండి. మార్గదర్శకుడు లేక, నాయకుడు లేక, కర్తవ్యం గోచరింపక, గమ్యస్థానం గుర్తులేక, తహతహలాడిపోతోంది దేశం. దేశాన్ని ఈ ఘోరవిపత్తు నుండి ఉద్ధరించాలంటే ముందుగా ఆహారసమస్యను పరిష్కరించాలి. అందుకు జాతీయప్రభుత్వం ముఖ్యావసరం. జాతీయప్రభుత్వనిర్మాణం కావాలంటే జాతీయైక్యత సోపానం. దానికి వివిధపక్షసామరస్యమూ పట్టుగొమ్మ.

నేడీ ఆహారసమస్యను పరిష్కరించాలంటే సర్వపక్ష నాయకులనూ ఒకే రంగస్థలం మీదకు, తీసుకురావాలి. ఒకే అభిప్రాయాన్ని ఆమోదించేటట్లు చేయాలి. అందులకు ఐకమత్యం అవసరం. ఈ ఐకమత్యం సాధనంగా చేసికొని నాయకులందరూ, సమావేశమై, ప్రభుత్వానికి ఒత్తిడి కలుగజేసి జాతీయప్రభుత్వాన్ని కైవసం చేసికొని, ఆహార సమస్యా పరిష్కారానికి అవసరమయిన పద్ధతులను అనుసరించడానికి, అవకాశముంటుంది. అనగా ఆహారపదార్థాల నధికంగా ఉత్పత్తి చెయ్యడం, బంజరుభూములను సాగుచేయించడం, నదులకు ఆనకట్టలను కట్టి పంటలను వృద్ధిచేయడం, ధరలను కంట్రోలు చేయడం, ఈ పనులన్నీ సక్రమంగా జరుగుతాయి. దానివల్ల ప్రస్తుతం పీడించే ఆహారసమస్య శాంతిస్తుంది.



అయితే నాయకులు సమావేశమవుతారా? తమ రాజకీయ సిద్ధాంతాలను విసర్జించుకొంటారా? నాయక సామరస్యం లేనినాడు, జాతీయప్రభుత్వనిర్మాణం ఎల్లాగ జరుగుతుంది? అనే ప్రశ్నలు రావచ్చు. నిజంగా తమ నాయకత్వం నశించిపోతుందని పెద్దలు సామరస్యం కోసం పాటుబడరు. రాజకీయ సిద్ధాంతాలను వదలుకోరు. ఆ సమయమందే అభ్యుదయ రచయితల ఆవశ్యకత అధికంగా ఉంది. ఆకలిమంట చల్లార్చుకోడానికీ, ఆహార సమస్యలను పరిష్కరించడానికీ, జాతీయ ప్రభుత్వమే ముఖ్యావసరమని ప్రజాసముదాయంలో అభ్యుదయ రచయితలు తమ రచనల మూలంగా, ఏకాంక నాటికల మూలంగా, గేయాల మూలంగా, ప్రచారం సాగించినట్లయితే ప్రజలందరూ, అందులో నున్న సత్యాన్ని గ్రహిస్తారు. గ్రహించి జాతీయ ప్రభుత్వం నిర్మింపబడితేనే గాని, ఆహారసమస్య పరిష్కరింపబడదు, అని గుర్తిస్తారు. నాయకులు మూర్ఖంగా తమ సిద్ధాంతాలను మార్చుకోక, మామూలుగానే ఉంటే వారి నాయకత్వానికి తిలోదకాలిస్తారు. ఇచ్చి సంఘటితప్రజానీకమే జాతీయ ప్రభుత్వనిర్మాణానికి ప్రభుత్వంమీద తీవ్రమయిన ఒత్తిడిని తీసుకువస్తుంది. ఈ ప్రజలయొక్క ఆశయాన్ని ప్రభుత్వము నెరవేర్చవలసినదే. దీనికి ఇతర దేశాలలోని చాలా విషయాలు దృష్టాంతాలున్నాయి. ప్రజాశక్తి నిరుపమాన మయినది. దాని నెదిరించడానికి బలవత్తరమయిన యే ఆయుధ శక్తి చాలదు. ప్రజాశక్తి విజృంభించిందంటే ప్రభుత్వాలు తల్లక్రిందులయి తారుమారు కాకమానవు.

అయితే యీ ప్రజాశక్తి యెవరిమీద ఆధారపడియుంది, అని ప్రశ్నిస్తే, అభ్యుదయ రచయితమీద ఆధారపడి ఉందని మనవిచేస్తున్నాను. అతడు విస్పష్టంగా ఈ విషయాలను ప్రజాహృదయాలలో వెదజల్లే విధానంలో సామాన్య ప్రజలకు సహితమూ అర్థమయ్యే భాషలో, పల్లెటూరి పామర జనులకు కూడా రుచించే గేయాల్లో, వివరించాడంటే అశేష ప్రజానీకమూ కూడా అతని మార్గాన్ని అనుసరిస్తుంది. అతడు దేశాన్ని దుర్భర క్షామబాధనుండి, ప్రజల్ని ఆకలిమంటనుండి, తప్పించి, దేశమోక్ష సంధాతలలో అగ్రగామియై, దేశనాయకుడై, కీర్తింపబడతాడు.

సంఘమంటే ప్రజాసముదాయం. ఈ ప్రజాసముదాయమంతా నాయకులు చూపించిన దారినే నడుస్తుంది గాని బుద్ధిపూర్వకంగా ఆలోచించడం ఇంతవరకూ అనుభవంలో లేని విషయం. తత్రాపి నాయకులు సూచించినా గతానుగతికంగానే ప్రవర్తిస్తుందిగాని పాత సాంప్రదాయాలను పరిత్యజించి, అవసరమయిన నూతన పంథాల నాలోచించడానికిగాని అనుసరించడానికిగాని సాహసం చూపలేదు. మొదట్లో ధైర్యం కల వ్యక్తి, కష్టనిష్ఠూరాలకు సహించి ముందుకువస్తే అతనిలోవున్న నూతనత్వాన్నిగానీ, గొప్పతనాన్నిగానీ, ప్రథమంలో గ్రహింపలేక వెక్కిరించినా, క్రమక్రమంగా ఆ మతంలో ఆధిక్యతయుంటే గుర్తించి అనుసరిస్తుంది ఒక్కొక్కప్పుడీ సంఘం దాన్ని నడిపించుచున్న నాయకుల దుర్నాయకత్వంవల్లగాని, అనుస్యూతంగా వస్తున్న ఆచారసంతతిని ఒకేమారు విస



ర్జించలేకగాని, వక్రమార్గంలో సంచరించడానికి అవకాశముంది. అల్లాంటి సమయమందే సంఘశ్రేయస్సు నభిలషించి, అధఃపతితమౌతున్న ఆ సంఘాన్ని ఉద్ధరించడానికి కొందరు మహానుభావులు నడుంకట్టుకొని కార్యరంగంలో ప్రవేశించాలి. సంఘం సర్వాంగసంపూర్ణంగా, నిర్మాణయుతంగా కట్టుదిట్టంగా పని చేస్తున్నప్పుడే సామాజికులకు లాభము. సంఘానికి ధైర్యం, సాహసము, వివేచనాశక్తి, బలం, ఉన్ననాడే ఆ సంఘంవల్ల దేశానికి లాభం కలుగుతుంది.

కాంగ్రెసు, ముస్లిములీగు, హిందూమహాసభ మొదలయిన సంఘాలెన్నో నేడు దేశంలో వెలువడినాయి; అయితే ఈ సంఘాలన్నిటిలోను ఏది దేశకల్యాణానికి మార్గదర్శకమై దరిద్రనారాయణులకు పుట్టిల్లయిన బానిస భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తుంది? ఏ సంఘాన్ని అనుసరించినట్టయితే, భావికాలంలో ప్రజలకు కట్టబట్ట, తినుటకు తిండి, సంపూర్ణంగా లభిస్తాయి. ఈ సమాధానాలకు కావలసిన విజ్ఞానం ప్రజలకు కలగాలి.

సామాన్య ప్రజల హృదయాలలో, ఇంకా అజ్ఞానం కరడుగట్టి కాపురం చేస్తోంది. దీన్ని కరిగించాలని యెంత ప్రయత్నించినా, యెన్ని ఉపన్యాసాలిచ్చినా, కదలకపోవడమేగాకుండా పైపెచ్చు అధికమవుతోంది. ప్రస్తుత యుద్ధ సమయంలో దేశరక్షణభారము సర్వస్వమూ దేశీయుల భుజశక్తిమీదనే ఆధారపడియున్నా ప్రజలందరూ ఈ విషయాన్ని గుర్తింపలేక,—కేవలం ప్రజలేగాదు — కొందరు సాంఘి

క్షాభినివేశం గల నాయకులు కూడా గుర్తింపలేక రాజకీయంగా పతనమౌతున్నారు. దేశంలో భిన్న భిన్న సాంఘికసమస్యలు, హిందువులకూ, మహమ్మదీయులకూ, తీరని స్పర్థలు, పోట్లాటలు, జాతివిభేదాలు ఒకవంక చెలరేగి దేశంయొక్క భావి కల్యాణాన్ని భగ్నంచేస్తున్నాయి. దేశంలో నలుమూలలా పంచమాంగ దళమూ, జపాను ఏజంట్లూ, దుష్ప్రచారాన్ని సాగించి, అమాయుకులయిన ప్రజలను పెడత్రోవలోకి త్రిప్పడానికి సాధ్యమయినంతవరకూ ప్రయత్నం చేస్తూనేయున్నారు. ఇవన్నీ దేశరక్షణకు, ఆటంకదాయకములని నేను వ్రాయ నవసరము లేదు.

ప్రస్తుతం సాంఘికవిభేదాలు తొలగి, దేశంలో జాతీయ ప్రభుత్వ నిర్మాణం కావాలంటే సర్వసంఘసామరస్యమూ, సంఘటితం కావాలి. నిర్మాణయుతంగా ఉన్న అఖిల పక్షాలూ ఏకగ్రీవంగా తమ ఏకైక వాంఛను, ప్రభుత్వానికి తెలియజేసినట్లైతే ప్రభుత్వమూ వాంఛను నెరవేర్చకుండా, తప్పించుకోడానికి దారిలేదు. వివిధ సంఘాలకూ సామరస్యము కుదరక భిన్నభిన్న మార్గాలుగా సంచరిస్తూయుంటే యేవో సాకులను చెప్పి, అవసరమయితే సంఘవిద్వేషం బాగా ప్రబలడానికి తగినంత దోహదాన్ని, ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని, చేసి, తమ సామ్రాజ్యవాదము చిరస్థాయిగా ఉండాలనే, ప్రభుత్వము భావిస్తుంది. అవును. దాని తప్పేముంది. మన అజ్ఞానాన్నీ, అవివేకాన్నీ, మనం నిందించుకోవాలి గాని...



నేడు ఫాసిస్టుదురాశాపిశాచం వికృతరూపంతో విలయకాల మృత్యుసన్నిభంగా అన్ని దేశాలమీదా విరుచుకు పడుతోంది. ఇతర దేశాలమాట దూరంగా ఉంచండి. ముఖ్యంగా జపాను మనకు సరిహద్దులోనున్న బర్మా, మలయా మొదలయిన దేశాలను కబళించడంతోటే శత్రువుల యొక్క తాకిడి భారతదేశానికి మరీ సన్నిహితమై కాలం కోసం నిరీక్షిస్తోందని ప్రముఖ రాజకీయవేత్తలందరూ ఊహిస్తున్నారు. అందుచేత మన మాతృదేశాన్ని ఫాసిస్టు దుండగీండ్ర చేతుల్లో పడకుండా, మనమే సంరక్షించుకోవాలి. జపాను మన దేశాన్నికూడా వశపరచుకొన్నట్టయితే భారతీయులమయిన మనమింకా బానిసస్థితిలోకి పోతాం. ఎన్నడయినా స్వాతంత్ర్యవాయువులు పీలుస్తామనే ఆశకూడా అంతరిస్తుంది. కనక ప్రజలలో దేశభక్తినీ, దేశసంరక్షణశక్తినీ, మొక్కవోని ధైర్యసాహసాలను పురిగొల్పడానికి సమర్థమయిన రచనలు కావాలి. ఆ రచనలు దేశాభ్యుదయానికి మార్గదర్శకాలై యుండాలి. ఆ రచనలు చదివి ప్రజలందరూ అవసరమయితే కత్తిపట్టుకొని, కదనరంగంలో ప్రవేశించి, శత్రువుల్ని కసిమసంగి పూర్వభారతీయపౌరుషప్రతాపాలను సుస్థిరంగా ప్రతిష్ఠించాలి. అప్పుడే అభ్యుదయకవియొక్క రచనలు అభివృద్ధిదాయకములై దేశాన్ని బానిసత్వం నుండి తప్పించకలుగుతాయి. చూడండి ఫ్రెంచి రష్యను విప్లవాల చరిత్ర. అక్కడ ప్రసిద్ధులయిన రూసో, టాల్‌స్టాయి కవివర్యులు ప్రజాసామాన్యానికి అవసరు

మయిన రచనలు సాగించి, ప్రజలలో నిగూఢంగా లీన మైయున్న దేశభక్తిని ప్రకోపింపజేసి, యుద్ధరంగానికి తీసుకువచ్చి, శత్రువీరుల గుండెలను చీల్పించి, దేశాన్ని బానిసత్వమునుండి ఉద్ధరించి, ఆదర్శపురుషులయినారు. నిజంగా వారు తమ రచనలవల్ల ప్రజలలో ప్రచారాన్ని సాగించక పోయినట్లయితే ఆ సమిష్టి విప్లవంలో అశేష ప్రజానీకమూ పాల్గొనేదికాదు. దేశదాస్యమోక్షమూ సిద్ధించేదికాదు. శమీవహ్ని మోస్తరుగా అంతర్లీనమైయున్న ప్రజాశక్తిని ఉత్తేజపరచడానికి, ఆపైన సంఘటితపరచడానికి, అభ్యుదయ రచనలే అవసరము. ఫ్రెంచి రష్యను విప్లవాలలో అభ్యుదయ రచయితలవల్లనే విజయం వచ్చిందంటే అతిశయోక్తి మాత్రము కాదు.

నేడు చైనాలో అభ్యుదయరచయితలు చేస్తున్న ప్రచారం అద్వితీయం. తమ రచనల మూలంగా ప్రతిగ్రామమూ సంచరించి ప్రజలలో దేశరక్షణాసక్తిని పురిగొల్పి-శత్రువు నెదుర్కొనే వివిధపద్ధతులనూ సూచించి, ప్రజా సామాన్యాన్ని, ఆధారంగా చేసికొని, శత్రుమారణ హోమం జరుపుతున్నారు. కత్తి చేతోపట్టుకొని, యుద్ధభూమిలోకి వెళ్ళకుండా, కలంతో మారుమూలలనున్న పల్లెగ్రామాల్లో తిరుగుతూ, శత్రువులను చంపుతూఉన్న చైనా అభ్యుదయరచయితలు మనకు ఆదర్శభూతులుకాదూ? చైనా నేటికి ఎనిమిది సంవత్సరాల నుండీ జపానుకు లొంగకుండా, అజేయంగా వున్నదంటే ఆ విజయం అభ్యుదయరచయితల



మీద కూడా కొంత ఆధారపడి వుందని నమ్మండి. ఇది రచయితలు గర్వింపవలసిన విషయము కాదూ? ఆమార్గం అనుసరణీయం అవునంటారా? కాదంటారా? అయితే మీరు మాత్రం ఎందుకు ఆచరణలో పెట్టకూడదు?

చైనా విధంగానే రానున్న మహావిపత్తు నుండి భారత దేశాన్ని సముద్ధరించడానికి కలం పట్టుకోమని అభ్యుదయ రచయితల నర్థిస్తున్నాను.

సంఘంలో గల వ్యక్తిగతవిభేదాలను, జాతిగతభేదాలను, తొలగించి, సర్వపక్షసామరస్యము కూర్చడానికి గూడా అభ్యుదయరచయితయే సమర్థుడని మనవి. తేటతెలుఁగులో, చిన్నమాటలలో ప్రజల కందరకూ అందుబాటయ్యే శైలిలో మన పూర్వౌన్నత్యాన్ని గోల్పోవడానికిగాని, వర్తమాన బానిసభావానికిగాని, మన విజ్ఞానం, వికాసం అంతరించడానికిగాని, స్వాతంత్ర్య విహీనులై, అధఃపతితులై, భారతీయులందరూ వాపోవడానికిగాని, యీ భేదించి పాలింపబడడమే ప్రధానం కదా! "దేశీయులారా! ఇంకా యెంత కాల మీతేనె పూసిన కత్తులను, గోముఖవ్యాఘ్రాలను, నమ్మి మోసపోతారు. విషమమై, దేశారిష్టదాయకమైన యీ భేదభావాన్ని తొలగింపజేసికొని, సర్వమానవసోదరభావంతో మనలో మనకున్న సాంఘిక విభేదాలను చక్కబెట్టుకొని ఏకీభావంతో, ఏకకంఠంతో, ప్రభుత్వసింహాసనాన్ని కైవసం చేసికొని, పూర్వౌన్నత్యాన్ని పునఃప్రతిష్ఠితం చెయ్యండి" అనే ప్రబోధాన్ని ప్రచారం చేసినట్లయితే, ప్రజానీకం దీర్ఘనిద్రనుండి

మేల్కొని తమ వాంఛాపరిపూర్తికి వలయు సాధన సంపత్తిని సమకూర్చుకొంటుంది. అందుకనే అభ్యుదయరచయిత అభివృద్ధికరమయిన కవిత్వాన్ని వ్రాయడం ఆరంభించాలని అర్థిస్తున్నాను.

సాహిత్యానికి, ప్రజాజీవితానికి సన్నిహితసంబంధముండాలి. సాహితీచరితను పరిశీలిస్తే ప్రజాజీవిత ఘట్టాలన్నీ ప్రతిబింబించాలి. ప్రజాజీవితంతో సంబంధ మున్ననాడే ఆ సాహిత్యము సర్వజనసాధారణ మవుతుంది. సర్వజనుల ఆదరాన్ని సంపాదిస్తుంది. ఏ ఒక తెగనుగాని, వ్యక్తినిగాని ఉద్దేశించి వ్రాయబడిన కవిత్వం యీ రోజులలో అనవసరము. ప్రజల సమస్యల్నీ, ప్రజల జీవితాల్నీ, అవసరమయిన కార్యక్రమాన్నీ తెలియజేసే రచనలు కావాలి. అవే అభ్యుదయ రచనలు. అంటే సరళభాషలో, చిన్నపదాలలో, అధికమైన భావమిమిడ్చి, సామాన్య ప్రజా ఉద్యమానికి, సామాన్య ప్రజా అభివృద్ధికి అవసరమయ్యే కవిత్వాన్నే కవితల్లజులంతా వ్రాయాలి.

మన సంఘం స్త్రీకి గృహలక్ష్మి, సహధర్మచారిణి అనే పేరులుపెట్టి ఆమెను మోసగించి, ఆమె సర్వహక్కులను, స్వాతంత్ర్యాన్ని కూడా అంతరింపజేసి, భర్తమాట కెదురాడకూడదు, అందువల్ల పాపంవస్తుంది, పతి యెంత నీచుడయినా, గుణహీనుడయినా, కురూపి అయినా, అతనినే దైవంగా భావించాలి. పారుబోతయినా, తాగుబోతయినా, తన్నులు తింటూ, బానిసగానే



పడివుండాలి. స్త్రీకి స్వాతంత్ర్యం పనికిరాదు, అని శాసించింది. నిజమే, భర్తమాట కెదురాడరాదు. ఎప్పుడు? అతేడనుకూలుడయితే. వ్యతిరేకుడయితే ఆత్మస్వాతంత్ర్యాన్ని నశింపజేసుకోవాలా? పురుషుడు వాంఛిస్తున్న, అభివృద్ధి, ఆత్మస్వాతంత్ర్యమూ, స్త్రీ వాంఛింపడానికి అర్హురాలు కాదా? భర్త తాగుబోతయి, తన్నుతూ వుంటే తన్నులుతిని సపర్యలు చేయాలా? సోదరభావంతో పరపురుషునితో మాట్లాడినా అర్థంలేని అనుమానమా? ఈ విధంగా సంఘం భారతీయమహిళామణిని అరికాలితో అణచిపెట్టి తొక్కుతోంది. ఇంత నీచంగా స్త్రీని మనం పరికిస్తున్నామంటే ఆ విషయం భారతీయసభ్యతకు యెంత భంగకరమో, అవమానకరమో నిదానంగా ఆలోచించండి. మేధాసంపత్తిలో గాని, కార్యనిర్వహణవిషయంలోగాని, స్త్రీ పురుషుని కంటె తక్కువకాదు. ఆమె అన్నివిధాలా పురుషునితో సమానమయిన హోదాలో నుండవలసిన వ్యక్తి. నామమాత్రంగానే ఆమె అబలగాని కర్తవ్యనిర్వహణంలో సబలయే. నేడు విదేశాల్లో రమణీమణులే రాచకార్యాలను నిర్వహిస్తున్నారు. కార్యాలయాల్లో, కర్మాగారాల్లో, ఆసుపత్రిలలో, ఆహవరంగాలలో, పురుషులకంటె అధికంగా తమ విధాయకకృత్యాన్ని, నెరవేర్చుకొని దేశసేవ చేస్తున్నారు.

పూర్వకాలం మనదేశంలో మాత్రం దేశాన్ని సుభిక్షంగా రాజ్యపరిపాలన చేసిన మహిళామతల్లులు లేరా?

ఆహవరంగంలో అపరసత్యభామలవలె, అరివీరుల కుత్తుకల్ని, అసిధారల కెరజేసిన వీరనారీమణులు లేరూ? పండితసభలలో పాల్గొని, శాస్త్రీయవిషయాల్లో సహితమూ సర్వతోముఖమయిన చర్చ సాగించి పండితులయిన పురుషప్రకాండుల నోడించిన మానినీమానసీయులు లేరూ? కలం చేత్తో పట్టుకొని, కమ్మని కవిత్వం వ్రాసి సహృదయుల్ని రసవాహినిలో ఓలలాడించిన కవయిత్రీమతల్లులు లేరూ? ఉన్నారు. ఉన్నారని, నిర్వివాదంగా అందరూ ఒప్పుకుంటారు. కాని ఆవిధంగా నేడుకూడా తయారవడానికి భారతీయరమణి ముందుకువస్తే నిర్దాక్షిణ్యంగా వెనుకకు నెట్టుతున్నారు. ఇది ఘోరమంటారా? కాదా? ఆలోచించండి. స్త్రీ జాతి కూడా తన బాధ్యతనూ, విధులనూ గుర్తింపలేని అజ్ఞానదశలో వుంది. ఒకొక్కప్పుడామె అజ్ఞానవశంగా హద్దులను దాటి ప్రవర్తించడం కూడ అనుభవంలో వున్న విషయమే. ఆమె అజ్ఞానం తొలగడానికి, బాధ్యతను గుర్తెరిగి వర్తించడానికి అభ్యుదయకవి తన రచనలను సాగించాలి. "అమ్మా! నీకు అధికమయిన గౌరవముంది. నీ ఔన్నత్యం గొప్పది. నీవు మహిళాసంఘంలో జేరి నీ బాధ్యతను, నీ విధిని నీ హక్కులను కాపాడుకో!" అంటే అజ్ఞానంవల్ల స్త్రీయే అంగీకరించదు. ఆమె అజ్ఞానం పోయి, వికాసం కలిగే పద్ధతిలో రచనలు ఉండాలి. పూర్వకాలంలో స్త్రీలు పాఠశాలలకు వెళ్లి చదువుకోక పోయినా, సాంసారిక విషయాల్లో స్త్రీల కవసరమయిన విజ్ఞానము, గృహిణీ జీవితము, ప్రతిబింబితమయ్యే, మంచి పాటలు వ్రాయబడి ఉండడంవల్ల, ఆపాటలను



కంఠస్థం చేసికొని, శ్రావ్యంగా వినిపించడమే గాకుండా ఆచరణలో పెట్టేవారు. ఇప్పటికీ ఆంధ్ర దేశమందలి పెద్దముత్తైదువల దగ్గర కొన్ని పాటలు విన్నామంటే ఆ భావనా సంపత్తికి, విజ్ఞానానికీ, మనం గర్విస్తామో, లేక విచారిస్తామో! కనుక నేటి కనువయిన, స్త్రీజాతి కవసరమయిన విజ్ఞానాన్ని జానపద గీతికలలోనూ, పాటలలోను, సరళమయిన భాషలలో నిమిడ్చి రచిస్తే, ఆ పాటలు స్త్రీ జాతికి చైతన్యాన్ని పురికొల్పుతాయి.

రాజకీయంగా—జాతీయైక్యత, జాతీయ ప్రభుత్వము, స్వదేశ సంరక్షణ, మనకు అవసరకర్తవ్యాలు. ప్రజలలో నీ విషయాలను వ్యాపింపచేసి వారిని తగినకార్యక్రమంలో ప్రవేశపెట్టించడానికి అభ్యుదయరచన లవసరము.

ఆర్థికంగా—దుర్భర క్షామబాధవల్ల దేశంలో నున్న ఆబాల గోపాలమూ అలమటిస్తూఉన్న యీరోజులలో ప్రజలు ఈ క్షుధార్తి నుండి తెప్పరిల్లి భావికాలంలో అన్నోదకాలతో సుఖంగా కాలం గడపాలంటే అభ్యుదయరచన లవసరము.

సాంఘికంగా—దేశంలో తుపానులాగ చెలరేగి సంఘాన్ని నశింపచేస్తూవున్న జాతిమత విభేదాలనే విషవృక్షాల్ని కూకటివేళ్లతో పెల్లగించి సర్వపక్షాలకూ సామరస్యము కుదర్చాలన్నా - బలమయిన జాతిచేత తొక్కబడి అధఃపతితమౌతున్న బలహీనమయిన జాతిని సముద్ధరించాలన్నా అభ్యుదయరచన లవసరము.

భారతదేశం, క్షామబాధలవల్లనూ, రాజకీయ ప్రతిష్ఠంభనలవల్లనూ, భయంకరమయిన యుద్ధాగ్నులమధ్యనూ, నలిగిపోతూవున్న యీ రోజులలో - ప్రజలు అజ్ఞానపిశాచముచే ఆవరింపబడి, తమస్థితిని తాము గుర్తించుకోలేక, తమకు సర్వవిధాలా ఔన్నత్యం కలిగే మార్గాలు గ్రహించలేక దారి తెన్నూ లేకుండా అల్లాడుతూవున్న యీ సమయంలో, ప్రజాసముదాయాన్ని యీ ఆపత్సముద్రమునుండి ఉద్ధరింపగల దేశనాయకుడు అభ్యుదయరచయిత ఒక్కడే. ఇది పక్షపాతబుద్ధితోగాని, ఇతరులను న్యూనతపరచడానికిగాని, వ్రాసిన విషయంగాదు. అభ్యుదయరచయితయే తన రచనలమూలంగా విజ్ఞానాన్నీ, వికాసాన్నీ, విషయజ్ఞానాన్నీ, ప్రజల కందరకూ బోధపరచాలి. కార్య నిర్వహణానికి, కర్తవ్యాన్నీ, సాధనాలనీ, వారి కందే విధంగా అందజేయాలి. ఆనాడే దేశ మీ విపత్తునుండి తప్పించుకో గలుగుతుంది.

దేశంలో, ప్రత్యేకం రాజకీయవేత్త లొక యెత్తు, కవులు ఒక యెత్తు, అని గుర్తుంచుకోవాలి. రాజకీయవేత్త, దేశం యొక్క అభ్యున్నతికి వలయు మాటలు చెప్పగలడు. ఆ మాటలయినా తన ధోరణిలోనే వుంటాయిగాని ప్రజల అభిరుచులను అర్థం చేసికొని, వాళ్లకు అనుకూలమయిన ధోరణిలో నుండవు. కాని కవి మాత్రం బిచ్చగాళ్ళు పాడుకొని ఆనందించే బుడబుక్కలపాట దగ్గరనుంచీ, పండితులూ, సంగీత కలావేత్తలూ సంతసించే కమ్మని కవిత్వం వ్రాసి ప్రజాసముదాయాన్నంతా స్వాధీనపరుచుకోగలడు. అందు



వల్ల పిల్లల నాడించేటందుకు, తల్లులు జోలపాటలు పాడాలన్నా, ఊడ్పులు ఊడ్చే సమయంలో, పామర స్త్రీలు, ఉత్సాహం కోసం, పదాలు పాడాలన్నా, శ్రమజీవులు పగలంతా చేసిన శ్రమను మరచిపోయి సుఖంగా కాలం గడపడానికి జంగం కథలు కావాలన్నా, కవులే వ్రాయాలి. రాజకీయ గృష్టివుంటే కవులు చేసే ప్రచారం మరొక వర్గం చేయలేదు.

ప్రజల దైనందిన జీవితపద్ధతికీ, ప్రజలచిత్తవృత్తికీ, సన్నిహిత సంబంధం కలిగిన రచనలను కవి సాగించాలి. ప్రజాజీవితమందలి మాధుర్యాన్నిగాని, మలినాన్నిగాని, కవి నిరంకుశంగా బయటపెట్టాలి. ప్రస్తుతం సమాజంలో నున్న బలహీనతను గుర్తింపజేసి, ఆ బలహీనత, కుళ్ళు నశించిపోవడానికి వేరొక సుఖవంతమయిన మార్గాన్ని చూపెట్టాలి. అతనికి సత్యాన్వేషణము, ప్రజాసమీకరణమూ, ఈ రెండే ప్రధానాశయాలు. కవి నిర్జీవమయిన కథావస్తువును స్వీకరించి, కవిత్వం అల్లడానికి ప్రయత్నిస్తే సంఘంలో స్థానాన్ని పొందలేడు. ప్రజల కందకుండా కవిత్వం వ్రాసిన కవి పాతాళానికి పతనమవుతాడు. దేశకాలపాత్రతలను గమనించని కవి దేశంలో ఎప్పుడూ గౌరవం పొందలేడు. సమాజంయొక్క అభ్యున్నతికి కవి ఆశ్రయుడు కావాలి. కవి ఔన్నత్యానికి, సమాజం ఆశ్రయం కావాలి. కాబట్టి కవికీ సమాజానికీ అవినాభావసంబంధ మన్నమాట. ఈ సంబంధాన్ని గుర్తించలేక సమాజానికి భిన్నమయిన రచన సాగిస్తే, సమాజాన్ని నికృష్టదశలోకి

భారతదేశం, క్షామబాధలవల్లనూ, రాజకీయ ప్రతిష్ఠంభనలవల్లనూ, భయంకరమయిన యుద్ధాగ్నులమధ్యనూ, నలిగిపోతూవున్న యీ రోజులలో - ప్రజలు అజ్ఞానపిశాచముచే ఆవరింపబడి, తమస్థితిని తాము గుర్తించుకోలేక, తమకు సర్వవిధాలా ఔన్నత్యం కలిగే మార్గాలు గ్రహించలేక దారి తెన్నూ లేకుండా అల్లాడుతూవున్న యీ సమయంలో, ప్రజాసముదాయాన్ని యీ ఆపత్సముద్రమునుండి ఉద్ధరింపగల దేశనాయకుడు అభ్యుదయరచయిత ఒక్కడే. ఇది పక్షపాతబుద్ధితోగాని, ఇతరులను న్యూనతపరచడానికిగాని, వ్రాసిన విషయంగాదు. అభ్యుదయరచయితయే తన రచనలమూలంగా విజ్ఞానాన్ని, వికాసాన్ని, విషయజ్ఞానాన్ని, ప్రజల కందరకూ బోధపరచాలి. కార్యనిర్వహణానికి, కర్తవ్యాన్ని, సాధనాలనీ, వారి కందే విధంగా అందజేయాలి. ఆనాడే దేశ మీ విపత్తు నుండి తప్పించుకో గలుగుతుంది.

దేశంలో, ప్రత్యేకం రాజకీయవేత్త లొక యెత్తు, కవులు ఒక యెత్తు, అని గుర్తుంచుకోవాలి. రాజకీయవేత్త, దేశం యొక్క అభ్యున్నతికి వలయు మాటలు చెప్పగలడు. ఆ మాటలయినా తన ధోరణిలోనే వుంటాయిగాని ప్రజల అభిరుచులను అర్థం చేసికొని, వాళ్లకు అనుకూలమయిన ధోరణిలో నుండవు. కాని కవి మాత్రం బిచ్చగాళ్ళు పాడుకొని ఆనందించే బుడబుక్కలపాట దగ్గరనుంచీ, పండితులూ, సంగీత కళావేత్తలూ సంతసించే కమ్మని కవిత్వం వ్రాసి ప్రజాసముదాయాన్నంతా స్వాధీనపరుచుకోగలడు. అందు



వల్ల పిల్లల నాడించేటందుకు, తల్లులు జోలపాటలు పాడాలన్నా, ఊడ్పులు ఊడ్చే సమయంలో, పామర స్త్రీలు, ఉత్సాహం కోసం, పదాలు పాడాలన్నా, శ్రమజీవులు పగలంతా చేసిన శ్రమను మరచిపోయి సుఖంగా కాలం గడపడానికి జంగం కథలు కావాలన్నా, కవులే వ్రాయాలి. రాజకీయ దృష్టివుంటే కవులు చేసే ప్రచారం మరొక వర్గం చేయలేదు.

ప్రజల దైనందిన జీవితపద్ధతికీ, ప్రజలచిత్తవృత్తికీ, సన్నిహిత సంబంధం కలిగిన రచనలను కవి సాగించాలి. ప్రజాజీవితమందలి మాధుర్యాన్నిగాని, మలినాన్నిగాని, కవి నిరంకుశంగా బయటపెట్టాలి. ప్రస్తుతం సమాజంలో నున్న బలహీనతను గుర్తింపజేసి, ఆ బలహీనత, కుళ్ళు నశించిపోవడానికి వేరొక సుఖవంతమయిన మార్గాన్ని చూపెట్టాలి. అతనికి సత్యాన్వేషణము, ప్రజాసమీకరణమూ, ఈ రెండే ప్రధానాశయాలు. కవి నిర్జీవమయిన కథావస్తువును స్వీకరించి, కవిత్వం అల్లడానికి ప్రయత్నిస్తే సంఘంలో స్థానాన్ని పొందలేడు. ప్రజల కందకుండా కవిత్వం వ్రాసిన కవి పాతాళానికి పతనమవుతాడు. దేశకాలపాత్రతలను గమనించని కవి దేశంలో ఎప్పుడూ గౌరవం పొందలేడు. సమాజంయొక్క అభ్యున్నతికి కవి ఆశ్రయుడు కావాలి. కవి ఔన్నత్యానికి, సమాజం ఆశ్రయం కావాలి. కాబట్టి కవికీ సమాజానికీ అవినాభావసంబంధ మన్నమాట. ఈ సంబంధాన్ని గుర్తించలేక సమాజానికి భిన్నమయిన రచన సాగిస్తే, సమాజాన్ని నికృష్టదశలోకి

తీసుకుపోవడానికి తాను మార్గదర్శకు డయ్యాడని అర్థము. ఆ లోపాన్ని ఎవరయినా యెత్తిచూపితే, తన ప్రతిష్ఠకు భంగం వస్తుందేమోనని, తెలియకచేసిన తప్పుడు మార్గాన్ని తెలిసికొని, తెలియనితనాన్ని కప్పిపుచ్చడానికి వాఙ్మయ సంపదనూ, కుయుక్తులనూ, ఉపయోగించి బలపరుచుకోడానికి తంటాలుపడవలసివస్తుంది. "అడుసు త్రొక్కనేల? కాలు కడగనేల?" కనుక సమాజానికి భిన్నమయిన పద్ధతిలోగాని, ఆత్మానందం కొరకుగాని, పాండిత్యాన్ని ప్రదర్శించడానికిగాని, మధ్యతరగతి ప్రజల మెప్పులకుగాని, కవిత్వం వ్రాయడం దేశానికి అనవసరమే కాకుండా, అనర్థదాయకము కూడా అవుతుంది. సర్వజనులకూ తెలిసే వ్యవహారికభాషలో, సమాస రహితమైన శైలిలో, గానాని కనుకూలమైన గేయాల్లో, ప్రజలకు కర్తవ్యజ్ఞానం విషయవివేచనం బోధించే పద్ధతిలో కవిత్వ ముండాలి. దానినే అభ్యుదయరచన అనండి, లేక అభివృద్ధి రచన అనండి, కాక దేశకాలపాత్రలకు అవసరమయిన రచన అనండి. ఏదయినా ప్రస్తుతం వ్యవహారంలో రచనలకంటె విలక్షణం. విలక్షణమయినా నూతనంమాత్రం కాదు. ఈ పద్ధతి పూర్వకాలంనుంచీ ఆచరణలో వుంది. ఈ అభివృద్ధి రచనకు మనమే ఆరంభకులం కాదు. అభ్యుదయ కవులలో మనమే ఆదికవులమూ కాదు. అయితే పూర్వకాలంలో ఈ రచన క్వాచిత్కంగా కొందరు కవులచేతనే వ్రాయబడి వుంది. సామాన్య ప్రజల కవసరమయిన పద్ధతిలో కవి తన రచనను సాగిస్తే పేలవంగా ఉందని తోడి పండితలోకం



నిరసిస్తుందేమోనని సమకాలపువారి మెప్పులకు ఆశించిగాని, విమర్శలకు జంకిగాని యీ విధమయిన రచనలను సాగించడానికి ఉత్సాహం చూపలేదు కవిలోకం. సమకాలము వారి మెప్పుల కాశించడం సహజమేకదా? పైగా రాజును చూచిన కళ్లతో మొగుడిని చూస్తే ఏదో అన్నట్టు, సంస్కృత భూయిష్ఠ మయిన వృత్తరచనకు అలవాటుపడిన పండితలోకం గేయాల్నీ, పదాల్నీ చదవకుండా యీసడించడం కూడా ఉందని మన మూహించడానికి చాలా అవకాశాలున్నాయి. ఈ సమయంలో కూడా బెదరింపులకు, అదలింపులకు, అదరిపడి కవిలోకం సామాన్య ప్రజాజీవితంతో వున్న సంబంధబాంధవ్యాల్ని తెగతెంపు జేసుకొని ప్రజలోంచి దూర మవడానికి సిద్ధపడుతుందో? గ్రామస్థుల ఉద్యమాలకు, ప్రబోధానికి, విజ్ఞానానికి, అవసరమయిన పద్ధతిలో కలాన్ని నడిపించి, దేశాన్ని రక్షించడానికి, కంకణం ధరిస్తుందో? పరికించాలి.

సమాజంలోవున్న వ్యక్తి తన జీవితాన్ని గడపుకోవడానికి ఏదో ఒకవృత్తిని ఆధారంగా చేసికొని సుఖవంతంగా గడపుతాడు! కవి కూడా అదేవిధంగా కవిత్వాన్ని జీవికకాధారంగా చేసికోవడం తప్పనసరి. అందుచేత, తన భావాల్ని కూడా చంపుకొని జీవికకు ఇతరులను సంతృప్తిపరచడానికి మార్గాంతరాలను అన్వేషించడం, తదనుకూలంగా రచనలు సాగించడం మనం వాఙ్మయచరిత్రలో చూస్తున్నాము. కాని కొద్దిమంది స్వతంత్రభావాలు గల కవిశేఖరులు ప్రజా

జీవితముతో సంబంధం కల్పించుకొని, వారి చిత్తవృత్తులకూ, భావాలకూ, అవసరమయిన విధంగా కవిత్వం వ్రాయడమనే ఆచారం పూర్వకాలంలో కూడా లేకపోలేదు. కాని ఆరచనలను అభ్యుదయకవిత్వం అనే పేరుతో వ్యవహరించడం మాత్రం అలవాటు లేదు. తన కాలంలో అవసరమయిన సందేశాన్ని, నినాదాన్ని కవి ప్రజలకు అందజేశాడంటే అతడు అభ్యుదయకవి, అని మన మూహించవచ్చు. అతని రచన అభ్యుదయ రచన.

## అభ్యుదయరచన నేడే పుట్టలేదు.

నన్నయకు పూర్వకాలంలో నున్న ఆంధ్రవాఙ్మయాన్ని, పరిశీలించామంటే, ఆనాటి సాహిత్యమంతా, ప్రజాజీవితంతోటీ, ప్రజల సమస్యలతోటీ మేళవించి ప్రజా ఉద్యమాలకు దోహదమిచ్చే పద్ధతిలో ఉండేది. సామాన్య ప్రజాసముదాయమంతా ఆ రచనలు చదివి, లేక విని, ఆచరణలో పెట్టేవారు. ఆనాడు చదువుకొన్నవారిసంఖ్య తక్కువయినా, పురాణాలు, హరికథలు, జంగంకథలు, మూలంగా ప్రజల కందరకూ వాఙ్మయంలోని విషయం అవగత మవడానికి సావకాశాలున్నాయి. సంస్కృతభాషను, సంస్కృతభాషాగ్రంథాల్ని, మాత్రమే కొద్దిమందో చదువుతూ ఉండేవారు. అల్లాంటి కేవలం సంస్కృతభాషాపండితులకు తెలుగులో వ్రాయబడిన కవిత్వమంటే అయిష్టంగా ఉండేదని తెలుసుకోడానికి చాలా నిదర్శనా లున్నాయి. ఆ కాలంలో పండితపరిషత్తు లధికంగా ఉండేవి. ఏదయినా నూతనగ్రంథం ఆంధ్రంలోగాని, సంస్కృ



తంలోగాని వెలువడిందంటే పండితపరిషత్తు దాని గుణాగుణాలను నిష్కర్షగా విమర్శించేది. నన్నయ తన భారతభాగంలో నీ పండిత పరిషత్తుల నధికంగా పేర్కొన్నాడు. వాఙ్మయం అంతా సామాన్యజనులకు బోధపడే విధంగా, యక్షగానాలలోను, పదాలలోనూ, గేయాలలోనూ, సాధారణంగా ఉండే రోజులలో, పండితలోకం అంతా సంస్కృతభాషనే ఆదరించే రోజులలో, మహాభారత రచనకు గడంగిన ఆదికవి నన్నయభట్టారకుఁడే, అభ్యుదయ కవులలో అగ్రేసరుఁడై వెలసినాడు. భారతసంహిత పంచమవేదము గావున సమస్తధర్మశాస్త్రాలు, నీతులు, జటిలమయిన రాజకీయ సమస్యలు, రాజ్యపరిపాలనావిధానం దానిలో సమగ్రంగా రచింపబడి వుండడంచేత ఆంధ్రపాఠకలోకం అంతా భారతం ఆంధ్రీకరింపబడాలని అభిలాషను గాఢంగా వెల్లడించింది. రాజైన రాజరాజనరేంద్రుడు ప్రసిద్ధికెక్కిన తన పూర్వుల చరిత్రను వ్రాయమని అర్థించాడు. ఇంక కావలసిన దేమున్నది? నన్నయ మహాభారత రచనాభారాన్ని వహించి కొంతవరకు సాగించాడు. జైన బౌద్ధ మతాదులచేత సంకరం కాబోతున్న వైదికమతాన్ని ఉద్ధరించి దేశంలో వ్యాప్తిచేయవలసిన బాధ్యత కవులమీదవుంది. ఆ బాధ్యతను గుర్తించి నన్నయ తన భారతభాగంలో అవసరమయిన సందర్భంలో వైదికమత ప్రాశస్త్యాన్ని చూపకుండా లేఖినిని ముందుకు పోనీయలేదు. అందుచేత నన్నయ తన కాలంలో అభ్యుదయ కవియై ఆదర్శపురుషు డయినాడు.

ఆ కవిత్వంలో; జీవమూ, కళా, నిత్యనూతనంగా సంక్రమించి వుండడంవల్ల నాటినుండి నేటివరకూ ఆంధ్రుల ఆదరాభిమానాలను చూరగొంటున్నది. తాత్కాలికంగా అవసరమయిన రచన అయినా, శాశ్వతంగా వాఙ్మయంలో స్థానాన్ని పొందగల దనడానికి మహాభారతమే ప్రమాణము.

పూర్వకాలం ప్రజాసముదాయంలో మతావేశం ఎక్కువగా ప్రబలియుండేది. మతాన్ని ఎంతో పవిత్రంగానూ, ప్రాణంకంటె అధికంగానూ ప్రేమించేవారు. మత సంరక్షణ కొరకై ప్రాణాలను బలియిచ్చేవారు. ఎన్నో దారుణాలు, దురంతాలు, హత్యలు, యుద్ధాలు మతరక్షణకొరకు జరుగుతూ ఉండేవి. శైవమతమనీ, వైష్ణవమతమనీ, శాక్తేయమనీ, అద్వైతమనీ, ద్వైతమనీ యీ విధంగా మతాలు దేశంలో విరివిగా వ్యాపించాయి. సామాన్యంగా యుద్ధాలుకూడా మతాల మూలంగానే తటస్థించేవి. ఆంధ్రదేశంలో నేటికీ ప్రసిద్ధమయిన పల్నాటియుద్ధం శైవవైష్ణవమతాలకు జరిగిన సంఘర్షణకు ఫలితమేగదా! ఆంధ్రసామ్రాజ్యానికి తలమానిక మయిన కాకతి సామ్రాజ్యము విచ్ఛిన్నమై కాలగర్భములో లీనమవడానికి మతావేశమే ప్రధాన కారణము. మతవ్యాప్తికొరకై సామాన్యప్రజలకు సుబోధమయ్యే పద్ధతిలో ప్రచారం సాగించడానికి పాల్కురికి సోమనాథుడు, బసవపురాణ మనే శైవమత గ్రంథాన్ని అభ్యుదయరచనగా వెలువరించాడు. ఈ గ్రంథంలోని విషయం శైవమత ప్రతిపాదకమై ఆ నాటి శైవమతస్థులకు



అభివృద్ధి దాయకము కావడమే కాకుండా రచనలోకూడా అభ్యుదయ పంథా అనుసరింపబడివుంది. ఇదే బసవపురాణములో వున్న విశేషం. అప్పటికి తెలుగులో గ్రంథాలు వ్రాసిన కవులందరూ యెక్కువగా సంస్కృతవృత్తాల్లో, సంస్కృత భూయిష్ఠమైన శైలిలో, సమాసాలతో, తమ పాండిత్యాన్ని మాత్రమే ప్రదర్శించడానికి గ్రంథాలను రచిస్తూ వుంటే, సోమనాథుడు మాత్రము, జాను తెనుగు మాటలతో తెనుగు జాతీయపదాలతో, సర్వజనసాధారణమయిన ద్విపదలో, తన గ్రంథాన్ని రచించి సామాన్యప్రజల కందియ్యడం ఆకాలానికి అభ్యుదయపంథా కాదూ?

నన్నయ తరువాత కొన్ని శతాబ్దాలావిధంగా సంస్కృత భాషలోని గ్రంథాల్ని అనువదించి ఆంధ్రభాషలోకి తీసుకురావడం కవుల కాచార మయింది. అందుచేతనే దానికి భాషాంతరీకరణయుగ మని పేరుపెట్టారు. సంస్కృతభాషలో వున్న విషయాన్ని మక్కికి మక్కీగా ఆంధ్రంలోకి దిగుమతీ చేసినా, అవసరం వచ్చినప్పుడు కవిత్వంలో అభ్యుదయాన్ని సూచిస్తూ వచ్చిన కవులు కూడా లేకపోలేదు. ఈ యుగంలో శ్రీనాథకవిసార్వభౌముడు అభ్యుదయ కవియై ఆదర్శపురుషుడయినాడు. ఆనాటికి దేశంలో చైతన్యం, విజ్ఞానం, వీర్యం, నశించాయి. ప్రజలందరూ గతానుగతికంగా సంచరిస్తున్నారు. పండితులుగాని రాజులుగాని ప్రజాసామాన్యంలో విజ్ఞానం వ్యాపింప జేయడానికి లేశమయినా, తగిన ప్రయత్నాల నాచరించడంలేదు. అల్లాంటి సమయంలో శ్రీనాథుడు పల్నాటి

వీరచరిత్రను—కాదు—ఆంధ్రుల మహాభారతయుద్ధాన్ని, దేశం కోసం, యుద్ధరంగంలో ప్రాణాల నర్పించిన వీరాగ్రేసరుల చరిత్రాన్ని, కన్నులకు కట్టినట్లుగా చిత్రించాడు. చివికి, శిథిలమయిన ఆంధ్రపౌరుషాన్ని స్మరించాలంటే పల్నాటి చరిత్రను చదివితే బోధపడుతుంది. బాలచంద్రుడు ఆంధ్రులకు ఆదర్శవీరుడు. మాంచాల వీరపత్నిగా, ఈ పవిత్రవీరగాథను, నిర్జీవంగా, నిర్వీర్యంగా, నీరసంగా వున్న ఆంధ్రప్రజాసముదాయానికి, అందుబాటయ్యే ద్విపదలో, సులభశైలిలో వ్రాసి ఆంధ్రజాతికి చైతన్యాన్ని నేటికీ పురిగొల్పుతున్నాడు. అందుచేత పల్నాటి వీరచరిత్ర అభ్యుదయరచన కాదూ?

శ్రీనాథుని తరువాత కూడా ప్రబంధయుగంలో ప్రజలలో, విజ్ఞానాన్ని, వికాసాన్ని వ్యాపింప జేయడానికి చాలా అభ్యుదయరచనలు బయలు వెడలాయి. ప్రబంధ రూపంగా వెలువడిన యీ వాఙ్మయంలో తెనాలిరామకృష్ణునిచే రచింపబడిన పాండురంగ మాహాత్మ్యము అభ్యుదయరచనలలో లెక్కపెట్టదగినది. యథార్థానికి భక్తిని వెల్లడించడానికి వ్రాయబడిన గ్రంథమయినా, చిన్న చిన్న ఉపాఖ్యానాలమూలంగా ప్రజలకవసరమయిన సందేశాన్ని యిచ్చింది యీ గ్రంథం. ముద్రణాలయాలు, రాకపోక సౌకర్యాలు లేని ఆ కాలంలో కొన్ని రచనలు కాలవశంగా విస్మృతిపథంలో పడ్డాయి. మరికొన్ని ప్రజాసామాన్యంయొక్క హృదయాల్లో జీర్ణమయ్యాయి, ఇంకా కొన్ని పదాలు, గేయాలు, పామరజనుల నోట్లో నిలబడి వున్నాయి. నేడు మనం గ్రామాల్లోకి వెళ్ళి పామరజనులను



పరిశీలించామంటే వారి ముఖతా ఎన్నో రచనలను వినవచ్చు. మన ముసలమ్మలను పలకరించామంటే ఉత్తమమయిన వాఙ్మయాన్ని ఆమె మన కందజేస్తుంది. ఆ రచనల నన్నింటినీ వారి హృదయాల్లో మననం చేసికొని యింతవరకూ సంరక్షించుకు వచ్చారు. ఇదే మన భారతీయులకూ, పాశ్చాత్యులకూ వున్న భేదం. రచనలను గ్రంథస్థం చేయాలని వారి వాదన. కంఠస్థం చేయాలని మన వాదన. ఎన్నో శతాబ్దాలకు పూర్వము రచింపబడిన వైదికవాఙ్మయము గ్రంథస్థం కావడంవల్లనే, నిన్న మొన్నటి దాకా నిలచిందా? నేటికయినా ఆర్యవిజ్ఞానం మన నిరాదరణ వల్లనే యితర దేశాలపాలు కావలసివస్తోంది. వేదాన్ని సంపూర్ణంగా గురుపరంపరగా అభ్యసించిన పండితులున్నారు. కాని ఆదరం సున్న. అభివృద్ధికరమైన వాఙ్మయం పామర జనుల వద్దనూ, పెద్దలవద్దనూ, నేటికీ నిలవుంది. విజ్ఞానం వుందనుకొన్న నాగరికులు మాత్రం ఆ విధమయిన వాఙ్మయాన్ని ఉద్ధరించడానికి పూనుకోరు. భారతదేశానికి సర్వతోముఖమయిన యీ అధఃపతనానికి ముఖ్యకారణం ఆత్మవిశ్వాసం లేకపోవడమే. ప్రజలలో అనైకమత్యము, స్వార్థపరత్వము విజృంభించాయి. అంతఃకలహాలు, అనహానం ప్రజలకు అంతశ్శత్రువులుగా పరిణమించాయి. ఈ అవకాశాన్ని చూసుకొని విదేశీయులు వర్తకరూపంగా మన దేశంలో ప్రవేశించి, అదివరకే మొలకలెత్తి ఉన్న అంతఃకలహావృక్షాలకు సంపూర్ణమయిన దోహద మిచ్చి దేశాన్ని

యీ దుర్భరబానిసస్థితికీ, ప్రజలను యీ అస్వతంత్రనికృష్ట జీవనానికీ పాలుపరిచారు.

పిమ్మట కీర్తిశేషులు కందుకూరి వీరేశలింగం పంతులుగారు సాంఘికంగా అభ్యుదయ కవియై ఆంధ్ర లోకంలో అవతరించాడు. ఆయన భావాల్లో, భాషలో, రచనలో అభ్యుదయపంథాకు ఆరంభకులయినారు. సంఘంలోవున్న దురాచారాలను రూపుమాపడానికి వ్యాసాలూ, రచనలూ, ప్రహసనాలు, నాటకాలూ, సర్వజనసాధారణంగా వచనంలో సాగించారు. ఈ రచనల వల్ల ప్రజాసామాన్యంలో కొంత చైతన్యం యేర్పడ్డది. సంఘం తాను అవలంబిస్తూవున్న క్రూర విధానాన్ని కొంతవరకు సర్దుకొంది. సామాన్య ప్రజల్లో కూడా విజ్ఞానం వ్యాపించడానికి ఆరంభమయింది. నిజంగా ఆలోచించి చూస్తే సాంఘికంగా వ్యాపించివున్న దురాచారశృంఖలాలు కొంత సడలింపబడ్డాయన్నా, అంతకు పూర్వము తొక్కబడి నలిగిపోతూవున్న స్త్రీ జాతి కొంచెం ధైర్యంతో ముందుకు వస్తూవుందన్నా, దానికి శ్రీ వీరేశలింగపంతులుగారి రచనలే ప్రధానకారణాలని నిరాఘాటంగా వ్రాయగలను. కనుక ఈ యుగంలో వున్న అభ్యుదయ రచయితలకు ఆయన ఆదర్శపురుషుడు. రాజకీయంగా యీనాడు కొంత వాక్స్వాతంత్ర్యాన్నీ, పత్రికాస్వాతంత్ర్యాన్నీ అనుభవిస్తున్నామంటే దానికి కారణం దేశంలో కాంగ్రెసు మహాసంస్థ చేసిన అసమానమయిన త్యాగము. సుమారు యాభై సంవత్సరాల నుంచీ అది ప్రజల్లో గావిస్తున్న



ప్రచారంవల్లనే ఈ మాత్రమయినా ప్రజానీకము స్వాతంత్ర్యం కొరకు ఆవేదనపడుతోందని మన మంగీకరించాలి. కాని కాంగ్రెసు చేసిన ప్రచారం కూడా చాలదు. ఇంకా ఈ సమస్య అశేష భారతీయ ప్రజాహృదయాల్లోనూ ప్రవేశించాలి. అందుకొరకే నేడు కూడా అభ్యుదయ రచనల ఆవశ్యకత అధికంగా ఉంది. అయితే యీ అభ్యుదయరచన మన దేశానికి నూతనం కాదనీ, ఇతర దేశాల అనుకరణముకూడా కాదనీ, రుజువు చేయడానికిమాత్రం ఈ కొద్ది విషయమూ వ్రాశాను. కాగా అభ్యుదయరచన నేడే అంతరిక్షం నుండి ఊడిపడ లేదు, ఆదినుంచీ మన దేశంలో ఉంది అనే విషయం నిర్వివాదంగా తెల్లమయింది. ఇది ఆదినుంచీ ఆచారంలో నున్నా, దేశకాలపరిస్థితుల ననుసరించి యేకాలానికి ఏ విధంగా అభ్యుదయం అవసరమో, విజ్ఞానం అవసరమో, ప్రచారం అవసరమో, ఆ కాలానికి తగినట్టుగానే రచింపబడింది.

## అయితే కర్తవ్యం?

దేశాన్నీ, కాలాన్నీ, పరిస్థితినీ, అనుసరించి ప్రజల చిత్తవృత్తులు మారుతూఉంటాయి. కవులు వారి చిత్తవృత్తుల ననుసరించి వారిలో అవసరమయిన విజ్ఞానాన్ని ప్రసరింపజేయడానికి తమ అమూల్యమయిన రచనలను రచించాలి. ప్రస్తుతం సారస్వతంలో పాతపోకడలు పనికిరావు. మన దేశంలో సామాన్య ప్రజల్లో విజ్ఞానం చాలా తక్కువ. నిరక్షరాస్యతే మెండు. కవి వ్రాసిన విషయాన్ని స్వయంగా చదువుకోడానికి కూడా తాహతు లేనివారు చాలామంది యున్నారు. నిస్పృహా

నిరాశ, నీరసం, ప్రజల్ని గాఢంగా ఆవరించి యుంది. ఈ నీరసాన్ని వదలించి, చైతన్యాన్ని కలిగించాలంటే రచనలే ముఖ్యసాధనాలు. ప్రజాసముదాయమంతా, విజ్ఞానవంతమయితేనేగాని, జాతి కీబానిసస్థితి నశించదు. విజ్ఞానం ద్వారాగాని దేశానికి మోక్షం లభించదు.

కవికి ఇతరులకంటె భావనాదృష్టి అధికంగా ఉంటుంది. ఆ శక్తి మూలాన్నే పరోక్షము దయినా సరే, ప్రత్యక్షమం దయినా సరే, ఏ వస్తువు కనిపించినా దానిలో నితరులకు గోచరింపని నూతనత్వం, కవికి గోచరిస్తుంది. ప్రకృతిలో సౌందర్యమూ, ప్రజలలో కలిగే పరిణామమూ, సృష్టిలో కనిపించే రహస్యమూ, సామాన్య మానవ చక్షుస్సులకు గోచరం కావు. కవి హృదయానికి కనిపిస్తాయి. దాన్ని తిలకించి కవి ముగ్ధుడై, పులకితుడై, పరవశుడై, తాను అపూర్వ మనోహరంగా, గానం చేస్తాడు. ప్రజలకు వినిపిస్తాడు. కావ్యానికి ధ్వని ప్రధానమని ముందుగా మనవి చేసాను. ధ్వనిప్రధానమయిన కావ్యంలో, దేశరక్షణకొరకు, దేశస్వాతంత్ర్యం కొరకు, కత్తిపట్టుకొని కదనరంగంలోకి దూకండి, శత్రువులను రూపు మాపండి, అని ప్రత్యేకించి ప్రబోధం చేయనక్కర లేకుండానే దేశంకొరకు యుద్ధరంగంలో ప్రాణాల నర్పించిన వీరాగ్రేసరుల చరిత్రను జయలక్ష్మి పాణిగ్రహణ మాచరించిన యోధవతంసుల జీవిత సంగ్రహాన్ని, తేటతెనుగులో ప్రచారానికి అనువయ్యే రీతిగా నేడు వ్రాయాలి. ఆ కావ్యము విశ్వశ్రేయస్సుకు కారణభూతమై, విశ్వమానవ కల్యాణదాయకమై



తద్ద్వారా కవికి శ్రేయోదాయకమై, ప్రతిష్ఠ కారకమై అలరారితే ఆనందం.

రసపుత్రవీరుడు రాణా ప్రతాపసింహుని చరిత్రను తిలకించండి. ఆత్మాభిమానం, వ్యక్తిత్వం, స్వాతంత్ర్యపిపాస, గల రసపుత్రవీరాగ్రేసరుడు కావడం మూలాన దేశమాతను పరదాస్యానికి పాలుపరచడం ఇష్టంలేక, బానిసత్వానికి అంగీకరించక, భారత సార్వభౌముడయిన అక్బరు పాదుషాతో బహిరంగంగా కత్తికట్టి నిరంతరయుద్ధాల మూలంగా ఆజన్మాంతమూ, అశాంతిసముద్రంలోనే యీదులాడాడు గదా? అందులో స్వజాతీయు లయిన పలువురు రసపుత్ర వీరులు పాదుషాఆస్థానంలో ఉద్యోగాలను సంపాదించారు. మరి కొందరు అక్బరుతో వియ్యమందారు. కాని ప్రతాపసింహుడు మాత్రం అచంచలవిశ్వాసంతో, గాఢమయిన అభినివేశంతో, భారతీయున కుండవలసిన ధైర్యంతో, మేన ప్రాణాలున్నంత దనుక మేటిమ్లేచ్ఛవీరుల్ని ముప్పు తిప్పలూ పెట్టాడు.

మరాఠీయోధుడు శివాజీని చూడండి. జాతికి బ్రాహ్మణుడయినా యుద్ధరంగంలో రెండవ సవ్యసాచి. "ఇదం బ్రాహ్మ్యమిదం క్షాత్రం" అన్న లోకోక్తి ఆ పరశురామునకే చెల్లింది. తర్వాత శివాజీ వీరునకే చెల్లింది. భారతసామ్రాట్టు ఔరంగజేబుకు ప్రక్కలో బల్లెమై అతన్ని నిద్రపోనిచ్చాడా? ఆ కొండ మెలుకను పట్టుకోడానికి ఎన్ని పన్నాగాలు, ఎన్ని కుతంత్రాలు... అన్నీ బూడిదలో పోసిన పన్నీ రయ్యాయి. నిన్నగాక మొన్న సిపాయీల తిరుగుబాటు సమయంలో ఆ మహా

రాణి, రణరంగంలో అపరసత్యభామ, మూర్తీభవించిన క్షాత్రతేజము; దేశస్వాతంత్ర్యానికి అశ్వారూఢయై, ఖడ్గధారిణియై, శత్రువులకు మృత్యుదేవతాసంకాశయై యుద్ధభూమిలో నెక్కడ చూచినా తానై, యెంతమంది దేశద్రోహులను యమపురికి పంపింది? ఎంతమంది శత్రువులను నశింపజేసింది. ఆమె పాంచభౌతికశరీరము పంచత్వమందినా; యశఃకాయము ఆచంద్రతారమూ ప్రకాశింపవలసినదే! ఆ అశ్వారోహణ కౌశలం, ఆ ఖడ్గచాలనం, ఆ ప్రతివీర నిర్మథన, ఆ విద్యాపాటవం, ఆ దేశరక్షణాసక్తి, వర్ణించడం నా తరమా?

ప్రత్యేకం ఈ చరిత్రలనేకాదు. ఇల్లాంటి అవసరమయిన గాథలను ప్రజాసముదాయానికి అందజేయాలి. స్వాతంత్ర్యయుద్ధం సమీపింపబోతున్న యీ రోజులలో ప్రజలందరూ ఏకాభిప్రాయంతో ఏకకంఠంతో స్వదేశరక్షణకు, దేశదాస్యవిచ్ఛిత్తికి, నడుం కట్టుకోవలసిన రోజులు. నాతో నిమిత్తం లేదని తప్పించుకోకుండా ఈ మహాయజ్ఞకార్యక్రమంలో అందరూ పాల్గొని విజయ సాధనకు మార్గదర్శకులు కావాలి. ఎవరిమట్టుకి వారే తప్పించుకుతిరిగితే ఈ కార్యకలాపాన్ని నడిపించడానికి ముందంజవేసే ధీరులు శూన్యమవుతారు. పైగా కార్యక్రమము నిర్వీర్యమై ఉత్సాహాన్ని నశింపజేస్తుంది. తన శక్తిని అనుసరించి ప్రతిభారతీయుడు కూడా కార్యరంగంలో ప్రవేశింపవలసిన తరుణమిది. తిండిలేక అన్నార్తుల హాహాకారాలు దేశంలో నలుమూలలా వ్యాపిస్తున్నాయి. విజ్ఞానంలేని నిరక్షరాస్యుల కుమార్గాలు పెచ్చు



పెరుగుతున్నాయి. అమాయకులపై మోసగింపులు అధికమవుతున్నాయి. దేశం అంటే యేమిటి? దేశం ఎవరిది? దేశాన్నెందుకు రక్షించుకోవాలి? అన్న విషయాలుకూడా ప్రజాసామాన్యానికి తెలియవు. ఈ విషయాలన్నీ అభ్యుదయరచనలలో ప్రజాసముదాయానికి తప్పకుండా అందాలి. ఆ రచనల ఫలితంగా, భారతప్రజానీకమంతా ఒకే కార్యక్రమంలో పని చేయడానికి తయారయి, చిరంతన భారతీయదాస్యశృంఖలాలను పటాపంచలు చేసి స్వతంత్రభారతదేశసంపాదనకు సన్నద్ధం కావాలి. అప్పుడు అభ్యుదయకవి చరితార్థుడవుతాడు.

## ముగింపు

కావ్యానికి విశ్వశ్రేయస్సే ప్రధానాశయము. సార్వజనికంగా సహాయాన్నివ్వగల కావ్యాలే నేడు దేశానికవసరం గాని, ఆత్మానందం కొరకుగాని, వినోదం కొరకుగాని, ఇతరుల మెప్పుల నందడానికిగాని, వ్రాయబడిన రచనలు దేశదాస్యవిచ్ఛిత్తికి సాధనాలు కాకపోవడమే గాకుండా ప్రత్యుత అధఃపతనానికి సోపానాలుగా పరిణమిస్తాయి. అల్లాంటి కావ్యాలు చదివి ప్రజలు కర్తవ్యం గుర్తెరుగక సోమరితనాన్ని పెంచుకుంటారు. రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, ప్రజాసముదాయానికి ఉపయోగపడేటటువంటివన్నీ, సర్వజనులకూ గ్రాహ్యమయ్యే విధానంలో రచనలు, అన్నిభాషలలోను; అందులో ముఖ్యంగా మాతృభాష

## మ హా రా జ పో ష కు లు

శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహద్దర్
జమీందారు గారు, చల్లపల్లి యెస్టేటు.

## రా జ పో ష కు లు

1. శ్రీ శ్రీ గోగినేని వెంకటేశ్వరరావు చౌదరిగారు, మానికొండ
2. శ్రీశ్రీశ్రీ నాగభైరవ వెంకటరత్నంచౌదరిగారు, వెంట్రప్రగడ
3. శ్రీ పిన్నమనేని వీరయ్యచౌదరిగారు, శ్రీ రామా రైస్ మిల్లు మేనేజరు, రుద్రపాక
4. శ్రీసుంకర రంగయ్యచౌదరిగారు, ముక్కొల్లుపాడు

## పో ష కు లు

1. శ్రీయుత అట్లూరి వెంకటప్పయ్య చౌదరిగారు పంచాయితీబోర్డు ప్రెసిడెంటు, తెన్నేరు
2. శ్రీయుత దేవినేని వెంకటప్పయ్య చౌదరిగారు
3. శ్రీ సూరపనేని సుబ్బారావు చౌదరిగారు
4. శ్రీ అట్లూరు రామకోటయ్య చౌదరిగారు
5. శ్రీ లింగం సీతారామాంజనేయులుచౌదరిగారు, బొమ్ములూరు
6 శ్రీ మోటూరు ప్రకాశరావు చౌదరిగారు, దొండపాడు
7. శ్రీ సూరపనేని వెంకటేశ్వరరావు చౌదరిగారు ,,
8. శ్రీ అడుసుమిల్లి రామమోహనరావు చౌదరిగారు ,,
9. శ్రీ అట్లూరు నాగయ్య చౌదరిగారు ,,
10. శ్రీ సూరపనేని వెంకటాద్రిమయ్య చౌదరిగారు ,,
11. శ్రీ దాసరి కోటయ్య చౌదరిగారు, గొడవర్రు
12. శ్రీ రామినేని రామబ్రహ్మం చౌదరిగారు, ఎలుకపాడు
13. శ్రీ అట్లూరు సత్యనారాయణ చౌదరిగారు, ఉంగుటూరు
14. శ్రీ వీరమాచనేని సాంబమూర్తి చౌదరిగారు, అన్నవరం
15. శ్రీ అక్కినేని ఆంజనేయులు చౌదరిగారు, పోతురెడ్డిపల్లి
16. శ్రీ కోనేరు శ్రీహరి నారాయణచౌదరిగారు, మారేడుమాక
17. శ్రీ దోనేపూడి రామసుబ్బయ్య చౌదరిగారు, బెజవాడ
18. శ్రీ దోనేపూడి వెంకటాద్రిమయ్య, వేమూరి లక్ష్మీనారాయణ చౌదరిగార్లు, బెజవాడ
19. శ్రీ దోనేపూడి ఈశ్వర వెంకటేశ్వరచౌదరిగారు, బెజవాడ
20. శ్రీ పాలడుగు వీరభద్రయ్య చౌదరిగారు, వెంట్రప్రగడ
21. శ్రీ చలసాని కోటయ్యచౌదరిగారు, వెంట్రప్రగడ
22. శ్రీవంకనేని నాగభూషణంచౌదరిగారు, నాగభైరవ నీలాచలంచౌదరిగారు, వెంట్రప్రగడ

## చం దా దా రు లు

1. శ్రీ కొల్లి వెంకటేశ్వరరావు చౌదరిగారు, మానికొండ
2. శ్రీ పాలడుగు నాగేశ్వరరావుచౌదరిగారు, వెంట్రప్రగడ
3. శ్రీ నంకినేని సుబ్బయ్య, చదలవాడ సీతారామయ్య చౌదరిగార్లు, వెంట్రప్రగడ
4 శ్రీ కోనేరు సుబ్రహ్మణ్యం చౌదరిగారు, మారేడుమాక
5. శ్రీ కోనేరు బసవసుబ్బయ్యచౌదరిగారు ,,
6. శ్రీ లింగం వీరరాఘవయ్యచౌదరిగారు ,,
7. శ్రీ అట్లూరి బాలకృష్ణయ్యచౌదరిగారు, చవటపల్లి
8. శ్రీ వల్లూరిపల్లి వెంకటేశ్వరరావుచౌదరిగారు, గుడివాడ
9. శ్రీ ముత్యాల రామకృష్ణచౌదరిగారు, చెరుకువాడ
10. శ్రీ అక్కినేని భగవన్నారాయణచౌదరిగారు, పోతురెడ్డిపల్లి
11. శ్రీ చింతపల్లి వెంకటాద్రిమయ్యచౌదరిగారు, ఉనికిలి
12 శ్రీ కొమ్మన శ్రీరాములుచౌదరిగారు, పోతురెడ్డిపల్లి
13. శ్రీ గుత్తా నారాయణమూర్తిచౌదరిగారు, దొండపాడు
14. శ్రీ గుత్తా వీరయ్యచౌదరిగారు ,,
15. శ్రీ అట్లూరి వేణుగోపాలస్వామిచౌదరిగారు, తెన్నేరు
16. శ్రీ పొట్లూరి బసవయ్యచౌదరిగారు, గుడివాడ

* * *

నా ఇతర కృతులు

వెలుగు రవలు

యువక సింహం

విద్యుల్లత

*

రాబోవు గ్రంథము

పేదరైతు
(పద్యకావ్యం)

* * *